ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
అనకాపల్లి
జిల్లా వార్తలు
గురువారం 27 జూన్ 2024



మాదక ద్రవ్యాల నియంత్రణ అందరి బాధ్యత



అనకాపల్లిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా బుధవారం స్థానిక రింగురోడ్డు నుంచి నెహ్రూచౌక్ వరకు అధికారులు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ కేవీ మురళీకృష్ణతో కలిసి కలెక్టర్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం నెహ్రూచౌక్‌లో విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అధికారులు, వివిధ కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రతిజ్ఞ చేశారు. - వార్త 5వ పేజీలో..



అనకాపల్లి నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

పింఛన్ పండగ

ఒకటో తేదీన పంపిణీకి ఏర్పాట్లు

జిల్లాలో 2,64,023 మంది కోసం రూ.174.64 కోట్లు మంజూరు

- ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి 1,000 చొప్పున కలిపి ఒక్కొక్కరికి 7,000 అందజేత
- ఇంటి వద్దే పంపిణీకి సచివాలయ సిబ్బందికి బాధ్యతల అప్పగింత



(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

సామాజిక పింఛన్ లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, చేనేత, కల్లుగీత, మత్స్య కార, ఒంటరి మహిళ, ట్రాన్స్‌జండర్, డప్పు కళాకారులు వంటి సుమారు 12 రకాల పింఛన్ లబ్ధిదారులకు గత ప్రభుత్వం చెల్లించిన రూ.3 వేలు పింఛన్‌ను రూ.4 వేలుకు పెంచింది. ఇందులో భాగంగా జిల్లాకు అవసరమైన నిధుల కేటాయింపులు జరిగాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన తొలి రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పింఛన్ పెంపు ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోద ముద్ర వేసిన సంగతి తెలిసిందే. జూలై ఒకటో తేదీ నుంచి పెంచిన పింఛన్‌ను ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ పథకం కింద ఇవ్వాలని మంత్రి వర్గం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) అధికారులకు పింఛన్ చెల్లింపులకు అవసరమైన నిధులు రూ.174.67 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జూలై ఒకటో తేదీ నుంచి గత వైసీపీ ప్రభుత్వం చెల్లించిన రూ.3 వేలు పింఛన్‌ను రూ.4 వేలుకు పెంచి చెల్లించనుంది. ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీ ప్రకారం ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన రూ.1000 చొప్పున బకాయిలు కలిపి జూలై ఒకటో తేదీ నుంచి ప్రతి లబ్ధిదారుడికి రూ.7 వేలు వంతున ప్రభుత్వం చెల్లించనుంది.

అదే విధంగా దివ్యాంగులు, క్షయ రోగులకు రూ.3 వేలు పింఛన్‌ను వచ్చే నెల ఒకటో తేదీ నుంచి నెలకు రూ.6 వేలు వంతున చెల్లించనుంది. పూర్తి వైకల్యంతో కదల్లేని స్థితిలో ఉన్నవారికి గత వైసీపీ ప్రభుత్వం నెలకు రూ.5 వేలు చెల్లిస్తే, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నెలకు రూ.15 వేలు చెల్లించనుంది. కిడ్నీ, లివర్ వంటి దీర్ఘకాలిక రోగుల పింఛన్ రూ.5 వేలు నుంచి రూ.10 వేలకు పెంచి చెల్లించనుంది. జిల్లాలో 24 మండలాలు, అనకాపల్లి పట్టణం, ఎలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీల పరిధిలో 2,64,023 మంది పింఛన్‌దారులు ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వీరికి నెలకు రూ.3 వేలు వంతున జిల్లాకు ప్రతి నెలా రూ.77 కోట్లు కేటాయించేది. పెంచిన పింఛన్ రూ.1000తో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన బకాయిలు రూ.1000 కలిపి జూలై నెలలో ప్రతి లబ్ధిదారుకు రూ.7 వేలు వంతున చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం రూ.174.64 కోట్లు కేటాయించింది. ఈ మేరకు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం డీఆర్‌డీఏ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన పింఛన్ మొత్తాన్ని జూలై ఒకటో తేదీ నుంచి సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయనున్నట్టు తెలిసింది. పింఛన్ పంపిణీ ఏ విధంగా చేయాలన్నదానిపై ఇంకా ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదని డీఆర్‌డీఏ అధికారులు చెబుతున్నారు. జిల్లాకు విడుదలైన నిధులను సంబంధిత బ్యాంకులకు పంపినట్టు డీఆర్‌డీఏ పీడీ శశిదేవి తెలిపారు.

పండగలా పింఛన్‌ల పంపిణీ

జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో లబ్ధిదారులకు అందజేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల చేతుల మీదుగా అన్ని నియోజకవర్గాల్లో పెంచిన పింఛన్ మొత్తాన్ని అందజేయనున్నారు.

పంచాయతీలకు పూర్వ వైభవం

వైసీపీ ఐదేళ్ల పాలనలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

గ్రామ పంచాయతీలకు మంచి రోజులు రానున్నాయి. వైసీపీ పాలనలో నిర్వీర్యమైన ఈ వ్యవస్థకు కూటమి ప్రభుత్వం హయాంలో పూర్వ వైభవం రానున్నది. ఈ వ్యవస్థను గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండడంపై స్థానిక సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- అధికారాలు, నిధులు లేక సర్పంచులు గగ్గోలు
- కేంద్ర ఆర్థిక సంఘం నిధులను కూడా దారి మళ్లించడంతో పడకేసిన పనులు
- కనీసం సున్నం, బ్లీచింగ్ కొనలేని దుస్థితికి చేరిన పంచాయతీలు
- వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు పెద్ద ఎత్తున నిధుల కేటాయింపులు జరిపి సర్పంచుల ద్వారానే పల్లెల ప్రగతికి నిధులు ఖర్చు చేసేవారు. వందల కోట్ల రూపాయల వ్యయంతో గ్రామాల్లో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత సిమెంట్ రహదారులు కూడా నిర్మించారు. గ్రామ ప్రజల కోసం అవసరమైన మౌలిక వసతులను కల్పించారు. పంచాయతీ రాజ్, ఉపాధి హామీ పథకాల ద్వారా అనేక రకాల నిర్మాణ పనులు సర్పంచుల చేతుల మీదుగానే జరిగేవి. అంగన్‌వాడీలకు సొంత భవనాలు, డ్రైనేజీల నిర్మాణాలు, సామాజిక భవనల నిర్మాణ పనులు కూడా పంచాయతీల ద్వారానే జరిగేవి. ఎన్నికల ముందు వైసీపీ ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు 2019లో ఆ పార్టీకి అధికారాన్ని ఇచ్చారు. అయితే ఆనాటి నుంచి గడిచిన ఐదేళ్ల పాలనలో వైసీపీ అరాచక పాలనతో గ్రామ పంచాయతీలు అధ్వానంగా మారాయి.

అనకాపల్లి మండలం తుమ్మపాలలో సచివాలయంలో పంచాయతీ కార్యాలయం



వైసీపీ పాలనలో కానరాని అభివృద్ధి

వైసీపీ 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత పరిపాలన వికేంద్రీకరణ సాకుతో గ్రామ సచివాలయ వ్యవస్థను అమలు చేసి, వలంటీర్లను మధ్యవర్తులుగా పెట్టుకొని పాలన సాగించింది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. ప్రజలు ఓట్లేసి గెలిపించిన సర్పంచులకు కనీస అధికారాలు లేకుండా చేసిన సంగతి తెలిసిందే. ప్రధానంగా గ్రామ పంచాయతీలు వైసీపీ పాలనలో నిధులు లేక ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడాయి. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులను కూడా వైసీపీ సర్కారు పక్కదారి పట్టించింది. గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నుంచి ఏటా నిధులు జనాభా నిష్పత్తిని బట్టి ఏడాదిలో నాలుగు విడతలుగా కేటాయింపులు జరుగుతుంటాయి. వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీలకు విడుదలైన కేంద్ర ఆర్థిక సంఘం నిధులను సర్పంచులకు తెలియకుండానే వైసీపీ ప్రభుత్వం దారిమళ్లించి నవరత్నాలు వంటి సొంత అజెండా పథకాలకు వినియోగించింది. ఇక రాష్ట్ర వాటాగా పంచాయతీలకు విడుదల చేయాల్సిన నిధుల కేటాయింపుల ... మిగతా 6వ పేజీలో

కుమ్మేసిన వాన

ఉదయం నుంచి ఎండ, ఆ తరువాత భారీ వర్షం



నీట మునిగిన ఎలమంచిలిలోని కొత్తపేట మిలట్రీ కాలనీ వీధి

అనకాపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో పలు చోట్ల బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ దారెత్తించింది. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి భారీ వర్షం పడింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

అనకాపల్లిలో బుధవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి పరమేశ్వరిపార్కు జంక్షన్, దిబ్బవీధి, దేముడుగుమ్మం నుంచి కూరగాయల మార్కెట్‌కు వెళ్లే రహదారులు నీట మునిగాయి. విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద వర్షపు నీరు నిలిచిపోవడంతో ఈ మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రావికమతం మండలంలో మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మాడుగులలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఎలమంచిలిలో సాయంత్రం సుమారు 40 నిమిషాల పాటు కురిసిన భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. మిలట్రీ కాలనీ, కొత్తపేట ప్రధాన రోడ్డు, ఎల్ఐసీ కార్యాలయం రోడ్డు, ఎంపీడీవో కార్యాలయం రోడ్డు నీట మునిగాయి. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

చెరువును తలపించేలా బీఎన్ రోడ్డు

- ప్రమాదాలకు గురైన వాహనచోదకులు



బీఎన్ రోడ్డులోని వడ్డాది వద్ద వర్షపు నీటితో నిండిన గోతిలో పడ్డ ద్విచక్ర వాహనదారుడు

బుచ్చెయ్యపేట: మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈదురు గాలులు, మెరుపులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. బీఎన్ రోడ్డులో వడ్డాది, బంగారుమెట్ట, లోపూడి, ఎల్.సింగవరం, పొట్టిదొరపాలెం, బుదిరెడ్లపాలెం గ్రామాల వద్ద ఏర్పడిన భారీ గోతుల్లో వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. వడ్డాది వద్ద ఉన్న గొయ్యిలో నీరు చేరడంతో పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ గోతులను పూడ్చాలని స్థానికులు కోరు తున్నారు.

మాడుగుల మండలంలో పిడుగుపాటుకు ఒకరి మృతి · 5లో

ఇంటర్ ఫస్టియర్‌లో 34.31 శాతం ఉత్తీర్ణత

ఒకేషనల్ కోర్సుల్లో 41 శాతం నమోదు

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల

అనకాపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. జిల్లాలో ఇంటర్మీడియట్ జనరల్ విభాగంలో ప్రథమ సంవత్సర సప్లిమెంటరీ పరీక్షలకు 4,336 మంది హాజరు కాగా, వీరిలో 1,488 మంది(34.31 శాతం) ఉత్తీర్ణుల య్యారు. మే 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు ఇంటర్మీడియట్, ప్రథమ, ద్వితీయ సంవత్సర సప్లిమెంటరీ పరీక్షలు జరిగిన సంగతి తెలిసిందే. ద్వితీయ సంవత్సర ఇంటర్ ఫలితాలు ఈ నెల 18న విడుదలయ్యాయి.

కాగా జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు జనరల్ విభాగంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ కళాశాలల నుంచి 130 మంది హాజరుకాగా, 94 మంది ఉత్తీర్ణులయ్యారు. బీసీ వెల్ఫేర్ కళాశాలల నుంచి నలుగురుకి ముగ్గురు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి 1,439 మందిలో 451 మంది ఉత్తీర్ణులయ్యారు. అదే విధంగా హైస్కూల్ ప్లస్‌లో 67 మందికి 21 మంది, కేజీబీవీల నుంచి 112 మందికి 71 మంది ఉత్తీర్ణులయ్యారు. మోడల్ స్కూల్స్ నుంచి 74 మందికి 45 మంది, ప్రైవేటు కళాశాలల నుంచి 2,281 మందిలో 764 మంది, ఏఎంఏఎల్ నుంచి 114 మందిలో 14 మంది, ఎయిడెడ్ కళాశాలల నుంచి 115 మందిలో 25 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఒకేషనల్ కోర్సుల్లో....

ఒకేషనల్ విభాగంలో మొత్తం 773 మంది పరీక్షలకు హాజరు కాగా వీరిలో 317 మంది(41 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి 273 మంది పరీక్షలకు హాజరు కాగా, 123 మంది ఉత్తీర్ణులయ్యారు. కేజీబీవీలో 34 మందిలో 22 మంది, ప్రైవేటు కళాశాలల నుంచి 425 మంది రాస్తే 158 మంది, ఎయిడెడ్ కళాశాలల నుంచి 41 మందిలో 14 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈసారి సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల విడుదల సందర్భంగా ప్రథమ సంవత్సర విద్యార్థులు కూడా సమాధాన పత్రాలను రీ-వెరిఫికేషన్‌కు ఇంటర్ బోర్డు అవకాశం ఇచ్చింది. రీ వెరిఫికేషన్‌కు ప్రతి సబ్జెక్టుకు రూ.1000 చొప్పున చలానా తీయాల్సి ఉంటుంది.

టెన్త్ సప్లిమెంటరీలో 54.37 శాతం ఉత్తీర్ణత · 5లో

ఆలయ మాన్యం కైంకర్యం

ఎన్నికల ముందు రికార్డులను మార్చేసిన ధర్మకర్తల్లోని ఓ వర్గం

- వైసీపీ నేత అండదండలతో బరితెగింపు
- సహకరించిన రెవెన్యూ అధికారులు
- కారుచౌకగా ఓ రియల్టర్‌కు విక్రయించేసిన వైనం
- శిథిలావస్థకు చేరిన రామాలయ మరమ్మతులకు నిధులు లేని దుస్థితి
- విచారణ జరపాలని లంక ధర్మవరం గ్రామస్థుల డిమాండ్



లంక ధర్మవరంలో కూలిపోయిన రామాలయం మండపం

అచ్యుతాపురం, జూన్ 26:

మండలంలోని గొర్లె ధర్మవరం పంచాయతీ లంక ధర్మవరంలోని రామాలయం ఆస్తులకు ధర్మకర్తల్లోని ఓ వర్గం ఎసరు పెట్టింది. 7.81 ఎకరాల ఆలయ భూముల రికార్డులను వైసీపీ నేత అండదండలు, రెవెన్యూ అధికారుల సహకారంతో మార్చేసింది. ఇటీవల ఎన్నికల ముందు ఆ భూములను ఓ రియల్టర్‌కు కారుచౌకగా అమ్మేసింది. దీంతో శిథిలావస్థకు చేరిన ఆలయానికి మరమ్మతులు చేయడానికి కూడా నిధులు లేని దుస్థితి నెలకొంది. దీనిపై విచారణ జరపాలని లంక ధర్మవరం గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

లంక ధర్మవరం గ్రామంలో రామాలయం, పైడితల్లమ్మ, దుర్గమ్మ అమ్మవార్ల పూజాది కార్యక్రమాలు, ధూప దీప నైవేద్యాల కోసం లంక ధర్మవరం, గొర్లె ధర్మవరానికి చెందిన పెద్దలు గతంలో 11.81 ఎకరాల భూమిని కేటాయించారు. దీనిని పైడితల్లమ్మవారి మాన్యంగా రికార్డుల్లోకెక్కించారు. ఈ భూమిపై వచ్చే ఆదాయంతో మూడు దేవాలయాల్లో నిత్య ఆరాధన జరిపేవారు. అయితే దేవుళ్ల పండగలకు ఊరేగింపులు, చాటింపులకని 3.55 ఎకరాలు బారిక మాన్యం కింద కేటాయించారు. మిగిలిన భూమిలో గొర్లె ధర్మవరం గ్రామస్థులకు నాలుగెకరాలు, లంక ధర్మవరం గ్రామస్థులకు 4.20 ఎకరాలు అప్పట్లో పెద్దలు కేటాయించారు. ఈ భూమిపై వచ్చే ఆదాయంతో మూడు ఆలయాల నిర్వహణతో పాటు పైడితల్లమ్మవారి జాతరను ప్రతి సంవత్సరం ఘనంగా జరపాలని నిర్ణయించారు. పైడితల్లమ్మవారికి లంక ధర్మవరం పుట్టిల్లు గాను, గొర్లె ధర్మవరం అత్తవారిల్లుగా అప్పటి పెద్దలు నిర్ణయించారు. ప్రతి సంవత్సరం ముందుగా లంక ధర్మవరం గ్రామస్థులు (పుట్టింటి వాళ్లు) పండగ చేస్తారు. రెండు నెలల తరువాత గొర్లె ధర్మవరం గ్రామస్థులు (అత్తింటి వాళ్లు) పండగ చేస్తారు. అంతేకాక ఈ భూమిపై వచ్చే ఆదాయంలో రామాలయం, దుర్గాలయాలు కూడా అభివృద్ధి చేసేవారు. అయితే ఇటీవల ఎన్నికల ముందు లంక ధర్మవరం గ్రామానికి చెందిన ధర్మకర్తల్లో ఓ వర్గం.. వైసీపీ నాయకుల అండదండలతో పైడితల్లమ్మవారి మాన్యంగా రికార్డుల్లో ఉన్న ఈ భూమిలో బారిక మాన్యం 3.55 ఎకరాలతో పాటు లంకధర్మవరం ధర్మకర్తలకు చెందిన 4.20 ఎకరాలు వెరసి 7.81 ఎకరాలను ఓ రియల్టర్‌కి విక్రయించేశారు. ఇక్కడ సెంటు రెండు లక్షల రూపాయలు ఉండగా, ఎకరా రూ.12 లక్షలకు కారుచౌకగా విక్రయించేశారు. ఈ వ్యవహారంలో వైసీపీ ప్రధాన నాయకుడితో పాటు రెవెన్యూ అధికారులకు భారీ స్థాయిలో ముడుపులు ముట్టినట్టు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. కాగా లంక ధర్మవరంలో రామాలయం శిథిలావస్థకు చేరుకుంది. ఆలయ మండపం కూలిపోతోంది. దీనిని బాగు చేయించాలని గ్రామస్థులు కోరడంతో ఆలయ భూములు విక్రయించిన విషయం బయటకు వచ్చింది. గొర్లె ధర్మవరం గ్రామస్థులు మాత్రం తమకు కేటాయించిన నాలుగెకరాల్లో జీడితోటలు పెంచి కౌలుకిచ్చి దానిపై వచ్చిన ఆదాయంలో పైడితల్లి అమ్మవారి పండగలు చేస్తున్నారు. ఈ నెల 25న పైడితల్లి అమ్మవారి పండగ గొర్లెధర్మవరం వాసులు ఘనంగా జరిపారు. కాగా దేవుడి మాన్యం విక్రయంపై విచారణ జరపాలని లంక ధర్మవరం గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

ఉల్లంఘనులపై విచారణ

అక్రమ క్వారీయింగ్‌పై ప్రభుత్వం దృష్టి

- ఉమ్మడి జిల్లాలో నాలుగింటిపై విచారణకు ఆదేశం
- విశాఖలో సీబీసీఎన్‌సీ భూముల్లో మొదలైన సర్వే
- పరవాడలో మాజీ మంత్రి ముత్యాలనాయుడు క్వారీపై త్వరలో దర్యాప్తు
- గుర్రంపాలెంలో అడ్డగోలుగా తవ్వకాలు

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి):

గత ప్రభుత్వంలో క్వారీల లీజులు, అడ్డగోలుగా చేపట్టిన తవ్వకాలపై ప్రస్తుత ప్రభుత్వం దృష్టిసారించింది. పర్మిట్లకు మించి తవ్వకాలు చేపట్టిన క్వారీల్లో ఏ మేరకు అక్రమాలు జరిగాయో నిగ్గు తేల్చాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి ఉమ్మడి జిల్లాలో నాలుగు క్వారీలపై అందిన ఫిర్యాదుల మేరకు విచారణ చేపట్టాలని ఆదేశించింది.

విశాఖ నగరంలోని సిరిపురం జంక్షన్‌లో సీబీసీఎన్‌సీ భూముల్లో నిర్మాణాల కోసం చేపట్టిన తవ్వకాలు, పరవాడ మండలంలో మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు కుమారుడి పేరిట తీసుకున్న క్వారీ, తాడి గ్రామంలో మరో క్వారీ, పెందుర్తి మండలం గుర్రంపాలెంలో ఏపీఐఐసీ భూముల్లో పారిశ్రామికవేత్తలకు ఇచ్చిన ప్లాట్ల చదును పేరిట



పెందుర్తి మండలం గుర్రంపాలెంలో తవ్వకాలు జరిగిన ప్రాంతం

సమీపంలో కొండను తవ్వడంపై విచారణ చేయాలని గనుల శాఖకు ప్రభుత్వం సూచించింది. క్వారీయింగ్‌కు ఎంత విస్తీర్ణం మేర లీజుకు తీసుకున్నారు?, తాత్కాలిక పర్మిట్లు ఇచ్చారా?, లేదా?, పర్మిట్‌కు మించి తవ్వకాలు జరిపారా?...తదితర విషయాలపై సమగ్ర సర్వే చేయాలన్న ఆదేశాలు వచ్చాయి. సిరిపురం జంక్షన్‌లో సీబీసీఎన్‌సీ స్థలంలో బహుళ అంతస్థుల భవనాల నిర్మాణాల కోసం లోతుగా పునాదులు తీయాల్సి ఉంది. దీనికోసం రాళ్లను దొలిచి అక్కడ నుంచి బయటకు తరలించాల్సి ఉంటుంది. ఇందుకు మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు సంబంధించిన సంస్థ లక్ష క్యూబిక్ మీటర్ల రాయి, మట్టి తవ్వి తరలించడానికి తాత్కాలిక పర్మిట్‌కు గనుల శాఖ నుంచి అనుమతి తీసుకుని రూ.రెండు కోట్లు రాయిల్టీగా చెల్లించింది. అయితే ప్రభుత్వం మారిన నేపథ్యంలో పలువురు ఆ స్థలంలో క్వారీయింగ్‌పై ఫిర్యాదులు చేయడంతో ... మిగతా 6వ పేజీలో



జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలిచిన పీవీ సత్యనారాయణకు బుధవారం విశాఖపట్నంలోని సంస్థ కార్యాలయంలో చెక్కు అందిస్తున్న ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు, పక్కన యాడ్ మేనేజర్ చక్రవర్తి



జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన రూపాదేవికి చెక్కు అందిస్తున్న ఆంధ్రజ్యోతి ప్రతినిధి జె.శ్రీనివాస్



రాష్ట్ర స్థాయిలో మూడో బహుమతి గెల్చుకున్న మామిడి వేద వర్షకు చెక్కు అందిస్తున్న గాజువాక ఆంధ్రజ్యోతి ప్రతినిధి మస్తాన్



జిల్లా స్థాయిలో రెండో బహుమతి గెల్చుకున్న డి.తాతారావుకు చెక్కు అందిస్తున్న దృశ్యం



జిల్లా స్థాయి రెండో స్థానంలో నిలిచిన టి.నరసింగరావుకు చెక్కు ఇస్తున్న ఆంధ్రజ్యోతి ప్రతినిధి శ్రీనివాస్

'ఎవరు గెలిచినా మీదే గెలుపు' విజేతలకు చెక్కులు పంపిణీ

- ఉమ్మడి విశాఖ జిల్లాలో గెలుపు గుర్రాలను సరిగా అంచనా వేసిన నలుగురికి నగదు బహుమతి
- రాష్ట్రస్థాయిలో మూడో బహుమతి దక్కించుకున్న గాజువాకకు చెందిన మామిడి వేద వర్ష

విశాఖపట్నం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో విజేతలుగా ఎవరు నిలుస్తారన్న దానిపై సరిగా అంచనా వేయాలంటూ 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక యాజమాన్యం నిర్వహించిన 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' పోటీలో ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురు విజేతలుగా నిలిచారు. మొత్తం 15 నియోజకవర్గాల్లో ఎవరు గెలుస్తారన్న దానిపై సరైన అంచనా వేసిన వందలాది మంది తమ కూపన్లను 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి పంపించారు. వాటిని ఈ నెల ఐదోతేదీన విశాఖ ఆంధ్రజ్యోతి దినపత్రిక కార్యాలయంలో లాటరీ తీసి, విజేతలను ఎంపిక చేశారు. జిల్లాకు చెందిన ఒకరు రాష్ట్రస్థాయిలో మూడో బహుమతిని దక్కించుకోగా, జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ బహుమతులకు నలుగురు ఎంపికయ్యారు. విజేతలకు బుధవారం చెక్కులను పంపిణీ చేశారు. రాష్ట్రస్థాయిలో మూడో బహుమతిని గాజువాక ప్రాంతానికి చెందిన మామిడి వేదవర్ష గెల్చుకున్నారు. ఈమెకు స్థానిక సిబ్బంది రూ.10 వేలు చెక్కును అందించారు. జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన అనకాపల్లి జిల్లా కశింకోట మండలం నర్సింగబిల్లి గ్రామానికి చెందిన యర్రా రూపాదేవి రూ.10 వేలు గెల్చుకున్నారు. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం సర్వసిద్ధి గ్రామానికి చెందిన తెప్పల నరసింగరావు, విశాఖ జిల్లా గోపాలపట్నం ప్రాంతానికి చెందిన పీవీ సత్యనారాయణ, గాజువాక పరిధి వడ్లపూడి ప్రాంతానికి చెందిన ద్రోణాద్రి తాతారావు విజేతలపై స్పష్టమైన అంచనాతో ద్వితీయ బహుమతి కింద రూ.5 వేలు చొప్పున దక్కించుకున్నారు. ఈ నలుగురు ఉమ్మడి విశాఖ జిల్లాలో కూటమి అభ్యర్థులు 13 స్థానాల్లో, వైసీపీ రెండు స్థానాల్లో విజయం సాధిస్తారని కచ్చితంగా అంచనా వేశారు. ద్వితీయ స్థానంలో నిలిచి రూ.5 వేలు బహుమతి గెల్చుకున్న పీవీ సత్యనారాయణకు బుధవారం 'ఆంధ్రజ్యోతి' విశాఖపట్నం బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు, అడ్వర్టైజ్‌మెంట్ విభాగం మేనేజర్ ఆర్.శ్రీనివాసచక్రవర్తి నగరంలోని కార్యాలయంలో చెక్కును అందించారు. మిగిలిన విజేతలకు ఆయా ప్రాంతాల్లోని 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులు చెక్కులను ఇచ్చారు.

అగనంపూడి టోల్‌గేటుపై దాగుడుమూతలు

- ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఫోన్
- ఆనందపురం-అనకాపల్లి జాతీయ రహదారి నిర్మాణం పూర్తయినందున అగనంపూడిలో టోల్‌గేటు ఎత్తివేయాలని విజ్ఞప్తి
- బుధవారం నిలిచిన వసూళ్లు.. కానరాని సిబ్బంది
- ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నామంటున్న ఎన్‌హెచ్ఐ ప్రాజెక్టు డైరెక్టర్



అగనంపూడి వద్ద టోల్‌గేటు

అగనంపూడి, జూన్ 26: అగనంపూడి టోల్‌గేటు వద్ద బుధవారం వసూలు ఆగాయి. అయితే ఇంకా నిలిపివేసినట్టేనని స్థానికులు భావిస్తుండగా, అలాంటిదేమీ లేదని నేషనల్ హైవే అథారిటీ అధికారులు అంటున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులతో చర్చిస్తున్నాంటున్నారు.

నగర పాలక సంస్థ పరిధిలో టోల్‌గేటు ఉండరాదన్న నిబంధనను తుంగలో తొక్కి, గత కొన్నేళ్లుగా వాహనాల నుంచి ఫీజు వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీనిపై ఈ ప్రాంతవాసులు చాలాకాలంగా ఆందోళనలు చేస్తున్నారు. 2019లో ఎమ్మెల్యేగా ఉన్న పల్లా శ్రీనివాసరావు...గాజువాక బార్ అసోసియేషన్ సాయంతో హైకోర్టులో న్యాయం పోరాటం చేసి టోల్‌గేటును ఎత్తివేయించారు. ఆ తరువాత మూడు నెలల వ్యవధిలోనే వైసీపీ అధికారంలోకి రావడంతో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు మళ్లీ టోల్‌గేటును ఏర్పాటుచేశారు. గత ఐదేళ్లుగా వాహనాల నుంచి ఫీజు వసూలు చేస్తున్నారు. దీంతో తాము అధికారంలోకి వస్తే టోల్‌గేటు తొలగిస్తామని ఇటీవల ఎన్నికల ముందు పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో కూటమి కార్యకర్తలు కొందరు మంగళవారం రాత్రి టోల్‌గేటు వద్ద ఆందోళన చేపట్టారు. స్టాపర్లు తొలగించి వాహనాల నుంచి ఫీజులు వసూలు చేయకుండా అడ్డుకున్నారు. అనంతరం ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఫోన్‌లో మాట్లాడారు. అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి నిర్మాణం పూర్తయ్యాక ఇక్కడ టోల్‌గేటును తొలగిస్తామని చెప్పారని, అయినా ఇంకా వసూళ్లు కొనసాగించడ మేమిటని ప్రశ్నించారు. టోల్‌గేటు వద్ద వసూళ్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమన్నారు. ఈ విషయంలో శాంతిభద్రతల సమస్య తలెత్తితే అందుకు హైవే అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీంతో మంగళవారం రాత్రి నుంచి టోల్ ఫీజుల వసూళ్లు నిలిచిపోయాయి. బుధవారం సిబ్బంది కూడా రాకపోవడంతో టోల్ బూత్‌లు ఖాళీగా దర్శనమిచ్చాయి. టోల్‌ఫీజుల వసూలు నిలిపివేయడంతో వాహన చోదకులు ఆనందం వ్యక్తంచేశారు.

డ్యామేజీని సరిచేస్తున్నాం: ఎన్‌హెచ్ఐ పీడీ

ఈ విషయమై నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాత్ రంజన్‌ను వివరణ కోరగా...అగనంపూడి టోల్ గేట్ కొంత దెబ్బతిందన్నారు. ఆ డ్యామేజీని సరిదిద్దే పనిని చేపట్టినట్టు వెల్లడించారు. టోల్‌గేట్ నిర్వహణపై ఉన్నతాధికారులతో చర్చిస్తున్నామని, ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.5 కోట్లు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం, జూన్ 26: వరాహలక్ష్మీ నృసింహస్వామికి గడచిన 28 రోజుల్లో హుండీలలో భక్తులు సమర్పించిన కట్నకానుకల ద్వారా సుమారు రూ.2.5కోట్ల ఆదాయం సమకూరింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి సింగాల శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో బుధవారం పరకామణిలో హుండీల ఆదాయం లెక్కించారు. నగదు రూపంలో రూ.2,50,52,507 ఆదాయం లభించింది. 183.2 గ్రాముల స్వర్ణం, 15.125 కిలోల రజితం ఆభరణాల రూపంలో లభ్యమైంది. వాటితోపాటు 395 యూఎస్ డాలర్లు, 79 సింగపూర్ డాలర్లు, 50 కెనడాకు చెందిన డాలర్లు, మలేషియాకు చెందిన 124 రెంగాట్ లభించాయి. లెక్కింపులో విశాఖ డిప్యూటీ కమిషనర్ రాధ, దేవాలయ ఏఈఓలు, పర్యవేక్షణాధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పలాస, గుణుపూర్, కోరాపుట్ పాసింజర్ రైళ్లు రద్దు

విశాఖపట్నం, జూన్ 26: పూండి, నౌపడ మెయిన్ లైనులో భద్రతా ఆధునికీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈనెల 27న (గురువారం) పలాస-విశాఖ (07471), విశాఖ-పలాస (07470), విశాఖ - గుణుపూర్ (08522), గుణుపూర్- విశాఖ (08521), కోరాపుట్- విశాఖ (08545) పాసింజర్ రైళ్లను రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. అలాగే, గురువారం పలు ఒరిజినేటింగ్ రైళ్లను రీ షెడ్యూల్ చేయడంతో భువనేశ్వర్ - చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ (12830) మూడు గంటలు ఆలస్యంగా, రాయపూర్-విశాఖ పాసింజర్ (08527) రెండు గంటలు, టాటానగర్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189) రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరుతాయని పేర్కొన్నారు.

ఇకపై వివేక్ ఎక్స్‌ప్రెస్ డైలీ

డిబ్రుగర్, కన్యాకుమారి మధ్య వారానికి ఐదు రోజులు నడుస్తున్న వివేక్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను (22504/ 22503) ప్రయాణికుల డిమాండ్ మేరకు డైలీ (ప్రతిరోజు) ఎక్స్‌ప్రెస్‌గా ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. డిబ్రుగర్ - కన్యాకుమారి వివేక్ ఎక్స్‌ప్రెస్ (22504) రైలు జూలై ఎనిమిది నుంచి, తిరుగు ప్రయాణంలోని కన్యాకుమారి- డిబ్రుగర్ వివేక్ ఎక్స్‌ప్రెస్ (22503) రైలు జూలై 12వ తేదీ నుంచి అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

బైలపూడి పాలసంఘం డైరెక్టర్ల ఎన్నిక వాయిదా

- టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య వాగ్వాదం
- పోలీసుల జోక్యంతో అదుపులోకి పరిస్థితి



రైతులను చెదరగొడుతున్న పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ డెయిరీ సూపర్‌వైజర్ దుర్గాప్రసాద్

చీడికాడ, జూన్ 26: మండలంలోని బైలపూడి పాలసంఘంలో ఇద్దరు డైరెక్టర్లను ఎన్నిక వాయిదా పడింది. టీడీపీ, వైసీపీ మద్దతుదారుల మధ్య ఏకాభిప్రాయంగా కుదరకపోవడంతో విశాఖ డెయిరీ సూపర్ వైజర్ సమావేశాన్ని వాయిదా వేశారు. అంతకుముందు ఇరు పార్టీల మద్దతుదారుల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. పోలీసులు జోక్యం కల్పించుకొని పరిస్థితిని చక్కదిద్దారు.

బైలపూడి పాలసంఘం అధ్యక్షుడు జాజిమొగ్గల నాగరాజుతో పాటు మరో డైరెక్టర్ పదవీకాలం ముగిసింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం సంఘంలో ఓటుహక్కు కలిగిన సభ్యులతో సమావేశం నిర్వహించారు. విశాఖ డెయిరీ సూపర్‌వైజర్ మాట్లాడుతూ ఇద్దరు డైరెక్టర్ల పదవీకాలం పూర్తయినందున కొత్తగా ఇద్దరిని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని కోరారు. దీనికి టీడీపీకి చెందిన పలువురు రైతులు చెరొక డైరెక్టర్ చొప్పున ఏకగ్రీవానికి ముందుకు రావాలని ప్రతిపాదించారు. దీంతో పాలసంఘం మాజీ అధ్యక్షులు నాగరాజుతో పాటు మరో 11 మంది పేర్లను పోటీకి ముందుకు వచ్చారు. ఆ సమయంలో వైసీపీకి చెందిన జాజిమొగ్గల ఈశ్వరరావు, గొల్లవిల్లి స్వామినాయుడుతో పాటు పలువురు రైతులు మాట్లాడుతూ సంఘం అధ్యక్షుడిగా ఇప్పటివరకూ 15 ఏళ్ల పాటు పని చేసిన నాగరాజును ఎన్నికల్లో మినహాయించి కొత్తవారికి అవకాశం ఇస్తే తమకు అభ్యంతరం లేదన్నారు. తాము ఏకగ్రీవానికి సిద్ధమేనని అన్నారు. దీంతో టీడీపీకి చెందిన సభ్యులు నాగరాజు కూడా పోటీలో ఉంటాడని చెప్పడంతో ఇరు వర్గాల వారు ఒక్కసారిగా లేచి వాగ్వాదానికి దిగారు. ఎస్ఐ నారాయణరావు, ఏఎస్ఐ నాగేశ్వరరావుతో పాటు మరో 8 మంది పోలీసులు కలుగజేసుకొని పరిస్థితిని చక్కదిద్దారు. ఆ తర్వాత కూడా ఎన్నికపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు సూపర్‌వైజర్ తెలిపారు. ఈ సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగుపాటుకు యువకుడి మృతి : ముగ్గురికి తీవ్ర గాయాలు



దగ్ధమైన పాక, మృతుడు భవానీ శంకర్ (ఫైల్)

మాడుగుల, జూన్ 26 : మండలంలోని గాదిరాయి గ్రామంలో పిడుగుపాటుకు ఒక వ్యక్తి మృతి చెందగా, ముగ్గురుకి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మండలంలో బుధ వారం సాయంత్రంఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో గాదిరాయి సమీపం లో ఉన్న సబ్‌స్టేషన్ ఎదురు గా ఉన్న పాకలో తల దాచుకునేందుకు వడ్డాది భవానీశంకర్, పెంటకోట ఈశ్వర్ వెంకట సత్యనారాయణ, సూర్యప్రకాష్ రావు, వడ్డాది అప్పలనాయుడు వెళ్లారు. అదే సమయంలో పాకపై పిడుగు పడింది. దీంతో పాకలో ఉన్న భవానీ శంకర్ (22) సెల్‌ఫోన్ చూస్తున్నాడు. పిడుగుపడిన దాటికి ఫోన్ పేలి మృతి చెందాడు. పాక దగ్ధమవడంతో భవాని శంకర్‌తో ఉన్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్టు ఆ గ్రామ సర్పంచ్ పెంటకోట జగన్నాథరావు తెలిపారు. గాయపడిన వారిలో మృతుడి తండ్రి కూడా ఉన్నారని తెలిపారు. మృతుడు భవానీశంకర్ డిగ్రీ పూర్తి చేశాడు. ఈ సంఘటనతో ఒక్కసారిగా గాదిరాయి గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి.

ఎలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్ తండ్రికి స్వల్ప గాయాలు

- విశాఖపట్నం వెళ్తుండగా కారు బోల్తా
- బైపాస్ రోడ్డు ఇరువాడ సమీపంలో ఘటన



గాయపడిన సత్యనారాయణ

సబ్బవరం, జూన్ 26 : అనకాపల్లి- ఆనందపురం జాతీయ రహదారిపై ఓ కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తండ్రి సత్యనారాయణకు స్వల్ప గాయాలయ్యాయి. బుధవారం సాయంత్రం ఆయన ఎలమంచిలి నుంచి జాతీయ రహదారి మీదగా విశాఖపట్నం కారులో వెళుతున్నారు. ఇక్కడి బైపాస్ రోడ్డులోని ఇరువాడ సమీపంలో ఒక్కసారిగా సదరు వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో సత్యనారాయణకు ముఖం పై స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అతనిని విశాఖపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై సీఐ పిన్నింటి రమణను సంప్రదించగా ప్రమాదం జరిగిందని, కానీ తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

మాదక ద్రవ్యాల నియంత్రణ అందరి బాధ్యత

- విద్యార్థులు, యువత ఆకర్షితులు కాకుండా చూడాలి
- ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం కావాలి
- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ



నెహ్రూచౌక్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

అనకాపల్లి టౌన్, జూన్ 26: మాదక ద్రవ్యాలకు అంతా దూరంగా ఉండడం వలన దేశ భవిష్యత్తు ఎంతో ఆరోగ్యకరమైనదిగా రూపొందించవచ్చునని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని రింగురోడ్డు నుంచి నెహ్రూచౌక్ వరకు అధికారులు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత ఎస్పీ కేవీ మురళీకృష్ణతో కలిసి కలెక్టర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాల వినియోగం పట్ల ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృత నిశ్చయంతో ఉన్నామని, అందుకు అనుగుణంగా విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా వంద రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందించామన్నారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో 63 విలేజ్ స్థాయి కమిటీలు, 16 మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వీటిద్వారా ప్రజల్లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా చైతన్యం కలిగించడం జరుగుతుందన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, అమ్మకాలు, వినియోగిస్తున్న వారి సమాచారం 14500 లేదా డయల్ 100/112కు సమాచారం తెలపాలని కోరారు. అడిషనల్ ఎస్పీలు కె.విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ జి.లక్ష్మణ్, డీఈవో ఎం.వెంకట లక్ష్మమ్మ, డీఎంహెచ్‌వో బాలాజీ, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ మనోహర్, ఇన్‌చార్జి ఆర్డీవో వి.రమామణి, ఎస్ఈబీ సూపరింటెండెంట్ కె.జయసింహచౌదరి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ శైలజారాణి, సీడ్ ఇన్‌చార్జి ఆర్గనైజర్ వి.సూర్యప్రకాశరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పలు శాఖల అధికారులు, వివిధ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

'రాంకీ' అక్రమంగా తవ్విన చెరువును మూసివేయాలి

- తానాం గ్రామస్థులు ఆందోళన
- యాజమాన్యం తీరుపై సీఐటీయూ ప్రతినిధులు ఆగ్రహం



చెరువు వద్ద ఆందోళన చేపడుతున్న తానాం గ్రామస్థులు

పరవాడ, జూన్ 26: మండలంలోని తానాం గ్రామానికి ఆనుకుని రాంకీ యాజమాన్యం అక్రమంగా తవ్విన చెరువును తక్షణమే మూసివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ రాంకీ యాజమాన్యం నిబంధనలను తుంగలోకి తొక్కి, అక్రమంగా తవ్విన చెరువుపై ఎన్‌జీటీలో కేసు వేయడం జరిగిందన్నారు. గ్రీన్ బెల్టుకు చెందిన స్థలంలో నిబంధనలు ఉల్లంఘించి, తవ్వకాలు సాగించిన చెరువును మూసివేయాలని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు ఆదేశాలిచ్చినా నేటికీ మూసివేయకపోవడం అన్యాయమన్నారు. ఈ చెరువులోకి ఫార్మా రసాయనాలు చేరడం వల్ల భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని వాపోయారు. ఈ కారణంగా పశువులు, మనుషుల ఆరోగ్యానికి ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ చెరువును మూసివేసి, కాలుష్యం నుంచి తానాం ప్రజలను కాపాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రొంగలి అప్పారావు, వర్రి భవానీ, వి.కన్నంనాయుడు, వర్రి అప్పారావు, ఆర్.ఎర్రయ్యమ్మ, వి.సన్యాసి, దేముడు తదితరులు పాల్గొన్నారు.

రాజీనామాకు ససేమిరా?

- నోటి మాటతో చెబితే చేయను, రాతపూర్వకంగా ఇవ్వాల్సిందే
- మొండికేస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి
- ఆ ఉత్తర్వులు తీసుకుని న్యాయస్థానానికి వెళ్లే యోచన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రసాదరెడ్డి మొండిగా వ్యవహరిస్తున్నారు. రాజీనామా చేయాలని ఉన్నతాధికారులు సూచించినా లెక్క చేయడం లేదు. తనకు నోటి మాటతో చెబితే చాలదని, రాతపూర్వకంగా ఇస్తేనే రాజీనామా చేస్తానని సందేశం పంపారు. ఏయూ వీసీ ప్రసాదరెడ్డి గడచిన ఐదేళ్లుగా వైసీపీ కోసం బహిరంగంగానే పనిచేశారు. టీడీపీ నాయకులను విమర్శించారు. ఒక ఉన్నత విద్యా సంస్థకు జవాబుదారీగా ఉంటూ అలా మాట్లాడడం తప్పు అయినప్పటికీ ఆయన వెనకడుగు వేయలేదు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తారని, యూనివర్సిటీని ఏలవచ్చునని భ్రమించారు. వైసీపీ ఓడిపోయినా కుర్చీ వదలడం లేదు. గవర్నర్ నియామకం ద్వారా తనకు పదవి వచ్చింది కాబట్టి ప్రభుత్వం దానిని రద్దు చేయలేదని ఆయన సన్నిహితుల వద్ద చెబుతున్నారు. ఒకవేళ రాజీనామా చేయాలని ఆర్డర్ ఇస్తే, అది చెల్లదంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని అంటున్నట్టు తెలిసింది. తనను వేధిస్తే ఏ విధంగా ఎదుర్కోవాలో తెలుసునని చెబుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంపై వాట్సాప్ గ్రూపుల్లో రిటైర్డ్ ఏయూ ఉద్యోగులు చాలా ఘాటుగా స్పందిస్తున్నారు. ప్రసాదరెడ్డి పవర్ మాంగర్ (పదవీ వ్యామోహం కలిగినవాడు) అని ఒకరు విమర్శించారు. ఇంకొకరు ఆయన్ను మామూలుగా పంపకూడదని, బలవంతంగా గెంటాలని సూచించారు. ఒక విద్యా సంస్థకు అధిపతిగా వ్యవహరిస్తున్న ఆయనపై ఉద్యోగులలో ఇంత వ్యతిరేకత ఉందా?...అని అంతా ఆశ్చర్యపోతున్నారు.

మూడు రోజుల్లో అన్న క్యాంటీన్ సిద్ధం



పనులు పరిశీలిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం, జూన్ 26 : అన్న క్యాంటీన్ పనులు మూడు రోజుల్లో పూర్తి కానున్నాయని నర్సీపట్నం ఆర్డీవో జయరాం తెలిపారు. బుధవారం ప్రాంతీయ ఆస్పత్రి ఎదురుగా ఉన్న అన్న క్యాంటీన్ పనులు పరిశీలించారు. జూన్ 18 లోగా అన్న క్యాంటీన్ భవనాన్ని సిద్ధం చేయాలని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో మునిసిపల్ అధికారులు అన్న క్యాంటీన్ భవనం శుభ్రం చేయించి రంగులు వేయిస్తున్నారు. వాష్‌బేసిన్లు, డైనింగ్ టేబుళ్లు, విద్యుత్, నీటి సరఫరా, మరుగుదొడ్ల మరమ్మతులు చేయిస్తున్నారు. మూడు రోజుల్లో మొత్తం పనులు పూర్తి కానున్నాయని ఆర్డీవో తెలిపారు.

రెండు గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు

- నలుగురికి జ్వరాలు ఉన్నట్టు గుర్తింపు



వాకపల్లిలో రోగులకు వైద్య తనిఖీలు చేస్తున్న హెల్త్ అసిస్టెంట్ పేరినాయుడు

చీడికాడ, జూన్ 26: మండలంలోని కోనాం శివారు గుడివాడ, వాకపల్లి గిరిజన గ్రామాల్లో బుధవారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. చీడికాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరాల్లో గుడివాడలో 23 మందికి, వాకపల్లిలో 18 మందికి తనిఖీలు చేసి, వీరిలో నలుగురికి జ్వరాలు ఉన్నట్టు గుర్తించారు. జ్వర పీడితులతో పాటు మరికొంతమందికి రక్తపరీక్షలు చేశారు. కోనాం సబ్‌సెంటర్ హెల్త్‌అసిస్టెంట్ పెంటకోట పేరినాయుడు మందులు అందజేశారు.

అనంతరం గుడివాడలో మురుగునీరు కాలువను పరిశీలించారు. రెండు గ్రామాల్లో వాటర్‌ట్యాంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా పేరినాయుడు మాట్లాడుతూ గుడివాడ గ్రామంలో ఉన్న మురుగునీటిని నిర్మూలించి ప్రాణాంతక వ్యాధులు సోకకుండా చర్యలు తీసుకోవాలని, రెండు గ్రామాల్లో వాటర్‌ట్యాంకులు క్లీనింగ్ చేయించాలని కోనాం సచివాలయ కార్యదర్శిని ఆయన కోరారు. ఈ మేరకు సచివాలయంలో లిఖితపూర్వకంగా వినతి అందజేశారు. ఈ శిబిరంలో ఆశవర్కర్లు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీలో 54.37 శాతం ఉత్తీర్ణత

అనకాపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో జిల్లాలో 54.37 శాతం ఉత్తీర్ణులయ్యారు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ 10 వరకు జరిగాయి. జిల్లా నుంచి 3,031 మంది పరీక్షలకు హాజరు కాగా 1,648 మంది(54.37 శాతం) ఉత్తీర్ణత సాధించారు. పరీక్షలకు 1,928 మంది బాలురు హాజరు కాగా, 1,037 మంది(53.79 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 1,103 పరీక్షలకు హాజరు కాగా, 611 మంది(55.39 శాతం) ఉత్తీర్ణులయ్యారు. జవాబు పత్రాల రీ కౌంటింగ్‌కు రూ.500, రీ వెరిఫికేషన్‌కు రూ.1000 చెల్లించే అవకాశం కల్పించారు. దీని కోసం దరఖాస్తు చేసుకోవాలనుకొనే విద్యార్థులు ప్రధానోపాధ్యాయులను సంప్రతించాలని పేర్కొన్నారు.

ఒకటి నుంచి జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు

అనకాపల్లి రూరల్, జూన్ 26 : జిల్లాలోని అక్రిడేటెడ్ జర్నలిస్టులకు జూలై ఒకటో తేదీ నుంచి అనకాపల్లిలోని ఉషా ప్రైమ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నారని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. జర్నలిస్టుతో పాటు వారి జీవిత భాగస్వామికి కూడా ఈ పరీక్షలు జరుపుతారని వివరించారు. 2023-24 సంవత్సరంలో అక్రిడేషన్ కలిగిన వారు ఇందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్యలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రిపోర్టులు మరుసటి రోజు ఉదయం పొందవచ్చని, రోజుకు 50 మందికి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు 70933 34466, 70933 34454లో సంప్రదించాల్సిందిగా కోరారు.

బైక్ పై నుంచి పడి ఒకరి వ్యక్తి మృతి

గొలుగొండ, జూన్ 26 : రోడ్డు ప్రమాదంలో బైక్ పై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రావణాపల్లి గ్రామానికి చెందిన రాజాన అప్పలనాయుడు (40) రావణాపల్లి గ్రామంలో రెండురోజుల క్రితం ప్రమాదంశాత్తు బైక్ పై నుంచి పడిపోగా తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి నుంచి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అప్పలనాయుడు బుధవారం మృతి చెందారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సమష్టిగా మునిసిపాలిటీ అభివృద్ధి

- రాజకీయాలకు అతీతంగా పనిచేసి ఆదర్శంగా నిలుద్దాం
- కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు, చిత్రంలో చైర్‌పర్సన్ రమాకుమారి

ఎలమంచిలి, జూన్ 26 : రాజకీయాలకు అతీతంగా ఎలమంచిలి మునిసిపాలిటీని అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. 'మనకు ఎవరు ఓటు వేస్తే.. వారికే పనిచేస్తామనే మైండ్ సెట్‌తో ఉంటే మాత్రం అటు వంటివారు మైండ్‌సెట్ మార్చుకోవాలని హితవు పలికారు. మునిసిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం ఇక్కడ చైర్‌పర్సన్ రమాకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యేగా ఎన్నికై తొలిసారిగా మునిసిపల్ సమావేశానికి హాజరైన విజయకుమార్‌కు అంతా శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరం పార్టీలకు అతీతంగా పనిచేసి రాబోయే తరానికి ఆదర్శంగా నిలుద్దామన్నారు. చైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ సభ్యులంతా సమష్టిగా మునిసిపాలిటీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. యానాద్రి కాలువ ఆధునికీకరణ గత 25 సంవత్సరాలుకు ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. ఎమ్మెల్యే విజయకుమార్ సహకారంతో ముందుకు తీసుకు వెళ్లాలని కోరారు. ఇదిలావుంటే, ఎప్పటిలాగే ఈసారి కూడా సమావేశం నిర్ణీత సమయంలో జరగలేదు. అర్ధగంట ఆలస్యంగా ప్రారంభమైంది. అజెండాలో పొందుపరిచిన అంశాలు చర్చకు రాకుండానే సమావేశం ముగించడం విశేషం. సమావేశం అనంతరం అధికారులతో ఎమ్మెల్యే చర్చించారు. చైర్‌పర్సన్ రమాకుమారి. వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, గుప్తా, పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలను అందజేసి సత్కరించారు. అదే విధంగా దాసరి కుమార్, రమణ బాబు, అచ్యుతరావు తదితరులు ఎమ్మెల్యేను అభినందించారు. ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రభాకరరావు, డీఈ వీరయ్య, టీపీవో శ్రీలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీను, ఆర్వో నీలిమ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో యువత గంజాయి పట్ల ఆకర్షితులు కాకుండా ఉండేందుకు గంజాయి ఆనవాళ్లు లేకుండా చర్యలు చేపట్టాలని ఎలమంచిలి పట్టణ, రూరల్ ఎస్ఐలు పాపినాయుడు, సింహాచలంలను ఎమ్మెల్యే విజయకుమార్ ఆదేశించారు. గంజాయి విపరీతంగా పెరిగిపోయిందని కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ రమాకుమారి చెప్పడంతో ఆయన పైవిధంగా స్పందించారు.


సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు

ఆక్రమణ తొలగింపులో ఉద్రిక్తత

- కోర్టు ఆదేశాల మేరకు అంతకాపల్లి వెళ్లిన అధికారులు
- ఇంటిని తొలగిస్తే ఆత్మహత్య చేసుకుంటామన్న దంపతులు
- యంత్రాలు కదలకుండా అడ్డుకున్న పలువురు గ్రామస్థులు


ఇంట్లో పెట్రోలు బాటిల్, తాడుతో అప్పారావు దంపతులు

సబ్బవరం, జూన్ 26 : మండలంలోని అంతకాపల్లి రెవెన్యూ పరిధి లగు దువారి కళ్లాల వద్ద ప్రభుత్వ భూమిలో నిర్మించిన పక్కా భవనం తొలగింపులో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆర్ఐ వీరయ్య, స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలివి. అంతకాపల్లి గ్రామం సర్వే నెంబరు 618/15లో 5.9 ఎకరాలు గెడ్డవాగు భూమి ఉంది. సదరు భూమిలో అదే గ్రామానికి చెందిన వెన్నల అప్పారావు పక్కా భవనం నిర్మించాడు. భవన నిర్మాణ జరుగుతుండగా, పలువురు పలు మార్లు అధికారులకు ఫిర్యాదులు చేశారు. వారు వచ్చి హెచ్చరించినా ఇంటి నిర్మాణాన్ని పూర్తిచేసేశారు. దీంతో గ్రామస్థులు కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో తక్షణమే గెడ్డవాగులో నిర్మాణం కూల్చివేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. బుధవారం రెండు ఎక్స్‌కవేటర్లు, పోలీసులు కలిసి సదరు ప్రాంతానికి వెళ్లారు. ఇది తెలుసుకున్న ఇంటి యజమాని అప్పారావు, అతని భార్య పెట్రోలు బోటిల్, తాడు పట్టుకొని ఇంట్లో గడియ పెట్టుకున్నారు. తమ ఇంటిని కూల్చి వేస్తే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. పలువురు గ్రామస్థులు చేరుకుని యంత్రాలు ఇంటి వద్దకు వెళ్లకుండా రోడ్డుపై అడ్డుకున్నారు. దీంతో డీటీ వెంకట్, ఆర్ఐ వీరయ్యలు చేసేది లేక ఈ వ్యవహారం నివేదిక రూపంలో కోర్టుకు సమర్పిస్తామని వెనుదిరిగారు. సీఐ పిన్నింటి రమణ, ఎస్ఐ ధనుంజయ్, వీఆర్వోలు వీవీఎస్ఎన్ మూర్తి, వెంకటేశ్, అనంత్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు పూర్వ వైభవం

... 3వ పేజీ తరువాయి

ఊసేలేదు. పంచాయతీలు కరెంటు బిల్లులు చెల్లించాలంటే ఇంటి పన్నులు వసూలు అయితేనే కానీ బిల్లులు చెల్లించలేని దుస్థితికి వెళ్లాయి. బ్లీచింగ్, సున్నం వంటి వస్తువుల కొనుగోలుకు నిధులు లేక పంచాయతీలు ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లాలో 646 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా పంచాయతీలను 522 గ్రామ సచివాలయాల పరిధిలోకి తెచ్చిన వైసీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయాలుగా పేరు మార్చి ఒక భవనంలో రెండు మూడు పంచాయతీ కార్యాలయాలను విలీనం చేసింది. ఆ కార్యాలయంలోనే సర్పంచులకు చాంబర్లు ఏర్పాటు చేసింది. ఆర్థిక సంఘం నిధులు సర్పంచులకు తెలియకుండానే ప్రభుత్వం దారి మళ్లించడంతో సర్పంచుల చేతిలో చిల్లిగవ్వ లేకుండా కాలం వెళ్లదీయాల్సి వచ్చింది. గ్రామ పంచాయతీలకు సకాలంలో నిధులు రాకపోవడంతో కొందరు సర్పంచులు పూర్తిగా పాలనపై దృష్టి కేంద్రీకరించలేకపోయారు. మరికొందరు సర్పంచులు అప్పులు చేసి చేపట్టిన పనులకు బిల్లులు అందక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టడంతో గ్రామ పంచాయతీలకు పూర్వవైభవం వస్తుందని స్థానిక సంస్థల ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఉల్లంఘనులపై విచారణ

... 3వ పేజీ తరువాయి

బుధవారం గనుల శాఖ అధికారులు సర్వే ప్రారంభించారు. తీసుకున్న తాత్కాలిక పర్మిట్లకు లోబడే తవ్వకాలు జరిపారా? లేక అదనంగా తవ్వారా? అనేది తేల్చడానికి సర్వే చేస్తున్నామని, ఇందుకు రెండు రోజులు సమయం పడుతుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అలాగే పెందుర్తి మండలం గుర్రంపాలెం ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో పలువురికి స్థలాలు కేటాయించారు. ప్లాట్ల చదును సమయంలో లేఅవుట్‌కు ఆనుకుని ఉన్న కొండ, సమీపంలో భూముల నుంచి మట్టిని తరలించారు. కొండ నుంచి మట్టి తరలింపునకు ఎటువంటి పర్మిట్లు తీసుకోలేదు. ఏపీఐఐసీ అధికారులు, సిబ్బంది ప్రోత్సాహంతోనే అక్కడ తవ్వకాలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదిలావుండగా పరవాడ మండలంలో రెండుచోట్ల గనుల శాఖ ఇచ్చిన క్వారీల్లో అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదుపై విచారణ చేపట్టనున్నారు. మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు తన కుమారుడి పేరిట గ్రావెల్ క్వారీ తీసుకున్నారు. ఇంకా తాడిలో మరో గ్రావెల్ క్వారీ ఉంది. ఈ రెండు క్వారీల్లో జారీచేసిన పర్మిట్లకు మించి తవ్వకాలు చేపట్టారని ఫిర్యాదు అందినందున త్వరలో విచారణ చేస్తామని గనుల శాఖ అధికారులు పేర్కొన్నారు. ఇంకా ఉమ్మడి జిల్లాలో మరికొన్ని క్వారీలపై కూడా ఫిర్యాదులు అందాయని, అయితే వాటి వివరాలు ప్రభుత్వం నుంచి రావలసి ఉందని చెబుతున్నారు.

మత్తు..జీవితాలు చిత్తు

- మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పలుచోట్ల అవగాహన ర్యాలీలు
- వాటి వల్ల కలిగే దుష్ఫలితాలను విద్యార్థులకు వివరించిన న్యాయవాదులు, పోలీసు అధికారులు


అనకాపల్లిలోని గవరపాలెం ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న న్యాయమూర్తి రమేష్


ఎలమంచిలి కళాశాలలో మాట్లాడుతున్న ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి స్వాతి భవానీ


సబ్బవరంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్పీ కేవీ సత్యనారాయణ తదితరులు

అనకాపల్లి టౌన్, జూన్ 26 : అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లాలోని పలుచోట్ల అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. ఇందులో భాగంగా అనకాపల్లి పట్టణం జీవీఎంసీ గవరపాలెం ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో న్యాయమూర్తులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. జిల్లా జడ్జి ఎస్.శ్రీవిద్య ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ సదస్సులో ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బీవీ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎలమంచిలి : మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలో పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి పి.స్వాతి భవానీ హాజరై మాదక ద్రవ్యాల వాడకం వల్ల అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థులతో అవగాహన ర్యాలీ జరిపారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.నూకరాజు, వైస్ ప్రెసిడెంట్ పి.వి.రమణ, సెక్రటరీ బి.హరిశంకరరావు, ఏజీపీ డి.వెంకటరావు, సీఐ గఫూర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, పోలీసు అధికారులు విద్యార్థులతో కలిసి మాదక ద్రవ్యాలకు వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. సీఐ గఫూర్, ఎస్ఐలు పాపినాయుడు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ సూచించారు. మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఇక్కడి పోలీసు స్టేషన్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల వల్ల అనర్థాలను డీఎస్పీ వివరించారు. సీఐ పిన్నింటి రమణ, సెబీ సీఐ పీడీ ప్రసాద్, ఎస్ఐ రాజశేఖర్, ధనుంజయ్‌లతో పాటు పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : మాదక ద్రవ్యాల వల్ల అనర్థాలను వివరిస్తూ పాయకరావుపేటలో పోలీసులు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. పీఆర్ గెస్టు హౌస్ నుంచి గౌతమ్ సెంటర్ వరకు జరిగిన జరిగిన ఈ రాలీకి పోలీసులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బందితోపాటు వివిధ కళాశాలల విద్యార్థులు హాజరై మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. సీఐ పి.అప్పలరాజు, ఎస్ఈబీ సీఐ ఎస్.ధర్మారావు, పీహెచ్‌సీ వైద్యాధికారి డి.సుభాష్, ఏఎస్ఐ గోవిందరావు, ఎస్ఈబీ ఎస్ఐ పి.జాన్‌ప్రసాద్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నక్కపల్లి : మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని చినదొడ్డిగల్లు పాఠశాలలో హెచ్ఎం కవిత ఆధ్వర్యంలో నిర్వహించారు. సీఐ విజయ్‌కుమార్ హాజరై మాదక ద్రవ్యాల వల్ల అనర్థాలను వివరించారు. అనంతరం అవగాహనా ర్యాలీ చేశారు. జనసేన మండల అధ్యక్షుడు వెలగా సుధాకర్, రవీంద్రనాథ్ ఠాగూర్ ఆంగ్ల క్లబ్ అధ్యక్షుడు యేడిద వెంకట రమణ, పీఈటీ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : మండలంలోని పలు గ్రామాల్లో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. సర్వసిద్ధి, పెనుగొల్లు పీహెచ్‌సీల వైద్యులు, పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ జరిపారు. అడ్డరోడ్డు తిమ్మాపురంలో సీఐ అప్పన్న, ఎస్ఐ విభీషణరావు ఆధ్వర్యంలో ఓ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎస్.రాయవరంలో సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్య బృందం, తిమ్మాపురంలో పెనుగొల్లు వైద్య బృందం పోలీసులతో కలిసి ర్యాలీలు జరిపారు.

ఎమ్మెల్యే కొణతాలకు వినతుల వెల్లువ


పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడ్ని అభినందిస్తున్న కొణతాల, పీలా

కొత్తూరు, జూన్ 26 : రాష్ట్రంలోని చంద్రన్న బీమా మిత్రలకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను సదరు సిబ్బంది కోరారు. ఈ మేరకు అనకాపల్లిలోని జనసేన కార్యాలయంలో బుధవారం వారు కలిసి వినతి పత్రం అందజేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత చంద్రన్న బీమాలో మిత్రలుగా పని చేస్తున్న వారందరినీ ఎటువంటి సమాచారం లేకుండా తొలగించారన్నారు. వెంటనే తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

'డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి'

అనకాపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ అనకాపల్లి డివిజన్ కార్యదర్శి గొర్లి తరుణ్ తదితరులు ఎమ్మెల్యే కొణతాలను కోరారు. ఈ మేరకు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. అనకాపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడమే కాకుండా మహిళా సంక్షేమ హాస్టల్‌లో సీట్లు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సభ్యులు పాల్గొన్నారు.

శుభాకాంక్షల వెల్లువ

అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను జనసేన పార్టీ కార్యాలయంలో పలు శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు బుధవారం కలిశారు. కశింకోట తహసీల్దార్ మధుసూదన్, డిప్యూటీ తహసీల్దార్ సురేష్ నాయుడు, ఆర్ఐలు దాసరి శ్రీకన్య, రమేష్, వీఆర్‌వో పృథ్వీ తదితర సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తుమ్మపాల -1 పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడుగా ఎన్నికైన చదరం కాశీ విశ్వేశ్వరరావును ఎమ్మెల్యే కొణతాల, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

'పల్లా'ను కలిసి చలపతిరావు



రాంబిల్లి, జూన్ 26 : టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును బుధవారం గాజువాకలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్ప గుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పశువైద్య కేంద్రాలను తనిఖీ చేసిన డీడీ

రాంబిల్లి, జూన్ 26 : మండల కేంద్రం రాంబిల్లితో పాటు పంచదార్ల, పెదకలవలాపల్లిలలో గల పశువైద్య కేంద్రాలను బుధవారం పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ పరిశీలించారు. పశువైద్య కేంద్రాల పనితీరు, ఈ పరిధిలో గల పశువుల ఆరోగ్య పరిస్థితి తదితరాలను అడిగి తెలుసుకున్నారు. పశువులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని సూచించారు. ఎలమంచిలి సహాయ సంచాలకులు డాక్టర్ సిహెచ్.ఎం.ఎం.గంగాధర్, రాంబిల్లి పశు వైద్యాధికారి రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

అతిసార నివారణపై అవగాహన సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న వైద్యాధికారిణి

కశింకోట, జూన్ 26 : ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంలో డయేరియా నివారణకు తీసుకోవాల్సి జాగ్రత్తలపై మండల స్థాయి అధికారులకు, సిబ్బందికి ఎంపీడీవో శేషుబాబు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం బుధవారం ఏర్పాటైంది. కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి యశోధ మాట్లాడుతూ ప్రజలంతా కాచి చల్లార్చిన నీటిని తాగేలా చైతన్యం చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కారు బోల్తా.. తప్పిన ప్రమాదం



లంకెలపాలెం, జూన్ 26 : జాతీయ రహదారి లంకెలపాలెం వద్ద బుధవారం తెల్లవారుజామున పెను ప్రమాదం తప్పింది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలివి. విశాఖ నగరాకి చెందిన సతీష్ కారులో విజయవాడ నుంచి విశాఖపట్నం వెళుతున్నారు. సదరు వాహనం లంకెలపాలెం సమీపంలోని జీపీఆర్ లేఅవుట్ వద్దకు వచ్చేసిరికి అదుపు తప్పి బోల్తాపడింది. కారులో ప్రయాణిస్తున్న సతీశ్‌తో పాటు మరొకరికి సల్పగాయాలయ్యాయి. అయితే వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది.

ముగిసిన షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవాలు




వేడుకల్లో భాగంగా కలసాలతో బాబా పల్లికీని ఊరేగిస్తున్న భక్తులు

పాయకరావుపేట, జూన్ 26 : ఇక్కడి బృందావనం లోని దుర్గాలమ్మ చెట్టు వద్ద గల షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. మూడు రోజు లపాటు నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా చివరి రోజు కాకాడ హారతి, పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలు, పుణ్య నదుల జలాలు కలిపి 108 కలశాలతో నగర సంకీర్తనతో పాటు బాబావారి పల్లకీ ఊరేగింపు నిర్వహిం చారు. పాండురంగస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ దగ్గుపల్లి సాయిబాబాతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ


డి.అగ్రహారంలో కిట్ల పంపిణీ దృశ్యం

ఎలమంచిలి, జూన్ 26 : మునిసిపాలిటీ పరిధి కొక్కిరాపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ కిట్లను పంపిణీ చేశారు. కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, స్థానిక పెద్దలు మజ్జి రాంబాబు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ రమణ, హెచ్ఎం పాపాజీ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : ధర్మవరం అగ్రహారంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, షూ, పాఠ్యపుస్తకాలతో కూడి కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఎంపీటీసీ సియ్యాదుల వరహాలమ్మ, ఉప సర్పంచ్ కలిగట్ల మాణిక్యం, హెచ్ఎం శంకర్, టీడీపీ మండల యూత్ అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు, నాయకులు బండి నాగేశ్వరరావు, కలిగట్ల బాబూరావు, గేదెల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పలు మండలాల్లో భారీ వర్షం


అనకాపల్లి కూరగాయల మార్కెట్ రోడ్డుపై నిలిచిపోయిన వర్షపునీరు


రాంబిల్లి మండలం అప్పన్నపాలెం కాలనీలో సీసీ రోడ్డుపై..

అనకాపల్లి టౌన్, జూన్ 26 : వాతావరణంలో మార్పుల కారణంగా జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం భారీ వర్షం కురిసింది. అనకాపల్లిలో ఉదయం నుంచి గుబురు ఎండతో పాటు ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేసింది. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఆకాశం మేఘావృతమై కుండపోతగా వానపడి చల్లబడడంతో అంతా ఉపశమనం పొందారు. ఇక్కడ 17.0 ఎంఎంగా వర్షపాతం నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. పలు రహదారులు జలమయమయ్యాయి. పరమేశ్వరీ పార్కు జంక్షన్, దిబ్బవీధి, దేముడుగుమ్మం నుంచి కూరగాయల మార్కెట్‌కు వెళ్లే రహదారుల్లో కాలువలు నిండిపోవడంతో వర్షపునీరు రోడ్లపై నిలిచిపోయింది. దీంతో పాదచారులు, వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పీటీడీ కాంప్లెక్స్ ఆవరణ చాలా వరకు వర్షపునీటితో నిండిపోయింది. విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి కింద వర్షపు నీరు నిలిచిపోవడంతో అంతా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పాయకరావుపేట : మండలంలో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. దీంతో గత కొద్ది రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు వాతావరణం చల్లబడడంతో సేదదీరారు. అయితే సాయంత్రం పడిన వర్షానికి పాఠశాలలు, కళాశాలల నుంచి ఇళ్లకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మెయిన్ రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు పెట్టుకునే చిరు వ్యాపారులు కూడా అవస్థలు పడ్డారు.

ఎలమంచిలి : వరుణుడు కరుణ చూపాడు. వర్షాకాలం ఆరంభమైనప్పటికీ గత వారం పదిరోజులుగా ఎండలతో అల్లాడిపోతున్న జనం బుధవారం సాయంత్రం నలభై నిమిషాలపాటు కుండపోతగా పడిన వర్షానికి వాతావరణం చల్లబడడంతో జనం ఉపశమనం పొందారు. అయితే ఎలమంచిలి పట్టణంలోని రోడ్లపై వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో రాకపోకలకు పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మిలిట్రీ కాలనీ, కొత్తపేట ప్రధాన రోడ్డు, ఎల్ఐసీ కార్యాలయం రోడ్డు, ఎంపీడీవో కార్యాలయం రోడ్డు, జలాలు వీధి తదితర ప్రాంతాల్లో ఎటు చూసినా నీరే కనిపించింది. వర్షాలు కురిసినప్పుడల్లా ఇక్కడ ఈ సమస్య ఉన్నా పరిష్కారానికి నోచుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం చూపాల్సిందిగా కోరుతున్నారు.

రాంబిల్లి : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం గాలులుతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు గంటపాటు ఏకధాటిగా పడడంతో చాలా చోట్ల రోడ్లు జలమయమయ్యాయి. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే నేవీ రోడ్డు దుస్థితి దారుణంగా తయారైంది. ఈ రోడ్డులో ఎక్కడికక్కడ గోతులు పడడంతో అందులో నీరు చేరడంతో వాహనచోదకుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. అయితే ఈ వర్షం వ్యవసాయ పనులకు ఉపకరిస్తుందని రైతులు చెపుతున్నారు.

పక్కాగా పాఠశాలల్లో 'మధ్యాహ్న భోజనం'


విద్యార్థులకు సూచనలు చేస్తున్న డీఈవో

కొత్తూరు, జూన్ 26 : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ పక్కాగా అమలు చేయాలని డీఈవో వెంకట లక్ష్మమ్మ సూచించారు. బుధవారం ఆమె అనకాపల్లి మండలం మార్టూరు ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. శతశాతం హాజరు ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పిల్లలందరికీ మధ్యాహ్నం పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందజేయాలన్నారు. డీఈవో కార్యాలయాధికారి వెంకటేశ్వరరావు, హెచ్ఎం విజయ, ఉపాధ్యాయులు ఆమె వెంట ఉన్నారు.

అచ్యుతాపురం జంక్షన్‌లో డస్ట్‌బిన్‌ల పంపిణీ


వ్యాపారులకు డస్ట్‌బిన్‌లు అందిస్తున్న అధికారులు

అచ్యుతాపురం, జూన్ 26 : పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురంలో పారిశుధ్య సమస్య పరిష్కారానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో పట్టించుకోక పోవడంతో ఇక్కడ ఈ సమస్య అధికమైంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికైన సుందరపు విజయకుమార్ ముందుగా అచ్యుతాపురం జంక్షన్ అభివృద్ధిపై దృష్టి సారించారు. భవన యజమానులు, షాపుల యజమానులతో సమావేశం ఏర్పాటుచేసి జంక్షన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. వీరంతా చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా పంచాయతీ తరపున ప్రతి ఇం టితో పాటు షాపులకు డస్ట్ బిన్‌లను సమకూర్చారు. బుధవారం నాయకులు కూండ్రపు వెంకునాయుడుతో పాటు కార్యదర్శి అమ్మాజీ వీటి పంపిణీని ప్రారంభించారు.

'దళిత మహిళపై దాడి అమానుషం'

పరవాడ, జూన్ 26: దేశపాత్రునిపాలెం శివారు సాయి నగర్ కాలనీకిచెందిన దళిత మహిళ మట్టా యశోధపై కత్తితో దాడి చేయడం అమానుషమని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, గాజువాక అధ్యక్షురాలు వరలక్ష్మి అన్నారు. బుధవారం వీరు బాధితురాలిని పరామర్శించి, ఘటనకు గల కారణాలను తెలుసుకున్నారు. దాడి చేసిన నిందితులు ఇద్దరిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. మహిళా ప్రతినిధులు పద్మ, సీఐటీయూ నాయకులు నాయుడు పాల్గొన్నారు.

హోం మంత్రి అనితను కలిసిన రత్నాకర్



అనకాపల్లి టౌన్, జూన్ 26 : రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను టీడీపీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించి వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారు.

'జాగృతి మేక్స్ సేవలు అభినందనీయం'


మహాసభను ప్రారంభిస్తున్న నాబార్డు అధికారి

సబ్బవరం, జూన్ 26 : జాగృతి పరస్పర సహాయక సహకార పొదుపు సంఘం మహిళలు అందిస్తున్న సేవలు అభినందనీయమని నాబార్డు అధికారి సమంతకుమార్ అన్నారు. జాగృతి మేక్స్ మహాజన సభ బుధవారం గొటివాడలో ఏర్పాటైన సందర్భంగా ముఖ్య అతిథిగా మాట్లాడారు. తొలుత జాగృతి ఎండీ కె.సుజాత, సంస్థ అధ్యక్షులు, డైరెక్టర్లతో కలిసి జ్యోతిప్రజ్వల చేశారు. సీవో మౌక్తిక, సంస్థ అధ్యక్షులు కోట్ని అమ్మతల్లి నాయుడు, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం జాగృతి మేక్స్ నూతన అధ్యక్షుడిగా సూర్యనారాయణ, మేనేజింగ్ డైరెక్టర్‌గా కందర్ప సుజాత, ఉపాధ్యక్షులుగా గుర్రం అప్పలనర్సమ్మలను ఎన్నుకున్నారు.

బీజేపీ నేత పీవీ చలపతిరావుకు నివాళి


చలపతిరావు చిత్రపటం వద్ద బీజేపీ శ్రేణుల నివాళి

కొత్తూరు, జూన్ 26 : బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు దివంగత నేత పీవీ చలపతిరావు జయంతిని బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చలపతిరావు సేవలు కీర్తించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కొండబాబు, బీవీఎస్ వర్మ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కర్రి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు వుడా రమేష్, జిల్లా కార్యదర్శి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

డయేరియా నివారణపై అవగాహన సదస్సు

అనకాపల్లి రూరల్, జూన్ 26 : జీవీఎంసీ 84వ వార్డు కొండకొప్పాక పాఠశాలలో బుధవారం డయేరియాకు వ్యతిరేకంగా, డ్రై డేపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనకాపల్లి జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ, వ్యర్థాలు వేరు చేయడం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ నిషేధం వంటిపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులు కూడా పరిశుభ్రతకు, వ్యక్తిగత పరిశుభ్రతకు అధిక అంతా ప్రాధాన్యం ఇచ్చేలా కృషి చేయాలన్నారు. వ్యాధులబారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. టీడీపీ నాయకులు నీలబాబు, శానిటరీ సూపర్‌వైజర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుజల స్రవంతి సాధనే లక్ష్యం : ఎమ్మెల్యే రాజు



మాట్లాడుతున్న చోడవరం ఎమ్మెల్యే రాజు

బుచ్చెయ్యపేట, జూన్ 26 : ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు సాధనే తన లక్ష్యమని చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. ఆయన బుధవారం చినమల్లాంలో విశ్వజ్ఞనుల విజ్ఞాన విహార క్షేత్రంలో హిమాలయ గురువులు వేదానంద బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక పుంసవన సంస్కారాలు, హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో ఎర్రవాయి ప్రాంతంగా పేరొందిన బుచ్చెయ్యపేట మండలం సుజల స్రవంతి ప్రాజెక్టుతోనే పచ్చవాయిగా అభివృద్ధి సాధించగలదన్నారు. సాగునీటి వనరుల అభివృద్ధే లక్ష్యంగా నియోజకవర్గంలో ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గొలగాని శ్రీనివాసరావు, రాజారావు, ఎం.బాబ్జీ, కె.సత్యనారాయణ, టీడీపీ నాయకులు దేవర తాతాజీ, వెలంకాయల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారి నాణ్యతపై తనిఖీ



రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ అధికారులు

నర్సీపట్నం, జూన్ 26 : మునిసిపాలిటీలో అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు జరిగిన మెయిన్ రోడ్డు విస్తరణ పనులను ఆర్ అండ్ బీ క్వాలిటీ కంట్రోల్ ఉన్నతాధికారులు బుధవారం పరిశీలించారు. సెంటర్ డివైడర్, రోడ్డు వెడల్పు కొలతలు తీసుకున్నారు. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలతో రోడ్డు పనులు పరిశీలించామని డీఈ తెలిపారు. దీనికి ముందు ఆరిలోవ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యత పరిశీలించామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఈఈ జి.శ్రీనివాస్‌నాయక్, ఎస్ఈ జీవీ భాస్కర్, ఆర్అండ్‌బీ ఈఈ రమేష్, డీఈ నాగ మోహనరావు, ఏఈ ప్రసాద్, మునిసిపల్ డీఈఈ నారాయణ పాల్గొన్నారు.

'విత్తనాలు కొన్న ప్రతి రైతుకు రశీదు ఇవ్వాలి'

దేవరాపల్లి, జూన్ 26 : విత్తనాలు కొన్న ప్రతి రైతుకు రశీదు విధిగా ఇవ్వాలని, ఎరువుల ధరల పట్టిక షాపుల ముందు ఉంచాలని లైసెన్సు విత్తనాల షాపుల యజ మానులకు వ్యవసాయశాఖ నర్సీపట్నం సహాయ సంచాలకులు టి.శ్రీదేవీ సూచించారు. బుధవారం స్థానిక విత్తనాలు, ఎరువుల షాపులు గ్రోమోర్, హేమరైతుడిపో, చైతన్య రైతు డిపో తనిఖీ చేశారు. గొడౌన్‌లో స్టాకు, రికార్డులను తనిఖీ చేశారు. అమ్మిన ఎరువులను ఈపోస్ మిషన్ ద్వారా నమోదు చేయాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారిణి ఎల్.వై.కాంతమ్మ, కిరణ్‌కుమార్ తది తరులు పాల్గొన్నారు.

17 నుంచి స్వయంభూ గౌరీశ్వరాలయంలో శ్రీరుద్ర మహాయాగం

» యాగం పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు, మల్లునాయుడు, కమిటీ సభ్యులు

చోడవరం, జూన్ 26 : స్థానిక స్వయంభూ గౌరీశ్వరాలయంలో జూలై 17 నుంచి 20 వరకూ మూడు రోజుల పాటు నిర్వహించే శ్రీలక్ష్మీగణపతి సహిత చండీశ్రీ రుద్రయాగాన్ని విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పిలుపునిచ్చారు. అర్చకులు కొడమంచిలి చలపతి సారథ్యంలో కాకినాడ బ్రహ్మశ్రీ శ్రీపాదరాజశేఖర అవధాని, బ్రహ్మశ్రీ బులుసు ప్రభాకర శర్మ బ్రహ్మత్వంలో ఈ యాగం అత్యంత వైభవంగా నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం గౌరీశ్వరాలయం వద్ద చండీయాగానికి సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే రాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గోవాడ షుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లునాయుడు, ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, జనసేన నాయకులు గూనూరు మూలినాయుడు, అర్చకులు చలపతి, స్థానిక పెద్దలు ఉప్పల సతీష్, పసుమర్తి మల్లిక్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బోరువెల్స్ ప్రారంభం

బుచ్చెయ్యపేట, జూన్ 26 : కేపీ అగ్రహారంలో సీఎల్‌సీ చర్చ్ మినిస్ట్రీస్ చర్చ్ (గాజువాక) వితరణగా నిర్మించిన మూడు తాగునీటి చేతి బోర్లను బుధవారం ఎంపీటీసీల మండల ఫోరం అధ్యక్షుడు దేవర అప్పారావు ప్రారంభించారు. కార్యక్రమంలో సుధీర్ మహంతి కుమారుడు హల్వాట్ మహంతి, సర్పంచ్‌లు ముచ్చకర్ల భవానీ, జి.వెంకయమ్మ, ఎస్.లక్ష్మి, టీడీపీ నాయకులు ఎం.తాతయ్యలు, డి.అప్పలనాయుడు, పూడి రామారావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యపై స్పెషల్ డ్రైవ్



దుకాణదారులతో మాట్లాడుతున్న పోలీసులు

కె.కోటపాడు, జూన్ 26 : మండల కేంద్రంలో మంగళవారం ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు బుధవారం ఉదయం నుంచి పోలీస్ సిబ్బంది ప్రతీ దుకాణం వద్దకు వెళ్లి దుకాణదారులకుఅవగాహన కల్పించారు. తమ వద్దకు వచ్చిన కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్డు మధ్యలో పెట్టడం, ట్రాఫిక్‌కు అడ్డంగా ఉంచరాదన్నారు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. భారీ వాహనాలు అన్‌లోడింగ్‌లు ఉదయం ఆరు గంటల లోపు, లేదా రాత్రి పది గంటలు తర్వాత చేపట్టాలని స్పష్టం చేశారు. ఆటోడ్రైవర్లు రోడ్డు పక్కన నిలిపి ప్రయాణికులను కిందకు దింపాలని సూచించారు.

వివిధ ప్రాంతాల్లో వర్షం

చీడికాడ/ మాడుగుల/ రావికమతం, జూన్ 26 : మండల కేంద్రం చీడికాడతో పాటు పలు గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. దీంతో వాహనదారులు, రాకపోకలు సాగించే వారు ఇబ్బంది పడ్డారు. సరుగుడు నాట్లు వేసిన రైతులకు, పాడిపశువులకు ఈ వర్షం ఉపయోగకరంగా ఉంటుందని రైతులు తెలిపారు.

మాడుగుల కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది.ఉదయం నుంచి ఎండతీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు ఉక్కపోత భరించలేక నానా అవస్థలు పడ్డారు. ఈ తరుణంలో మూడు గంటల నుంచి వర్షం కురవడంతో వాతవరణం చల్లబడింది. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు. రావికమతంలో మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఒక్కసారిగా ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ఈ ప్రాంతంలో ఈ ఏడాదిలో ఇదే పెద్ద వర్షమని రైతులు అంటున్నారు. ఇప్పటికే నాటిన సరుగుడు నాట్లుకు ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని, ఇక మెట్టు భూముల్లో కూడా సరుగుడు నాట్లుకు అనుకూలంగా ఉంటుందని రైతులు తెలిపారు.



చోడవరం : ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వద్ద విద్యార్థుల మానవహారం



కె.కోటపాడు : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ లక్ష్మీనారాయణ



నర్సీపట్నం : మాట్లాడుతున్న సివిల్ జడ్జి పటాన్ షియాజ్ ఖాన్



రావికమతం : ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

'మత్తు'లో పడితే భవిష్యత్తు చిత్తు

» యువత, విద్యార్థులకు పోలీసులు, ప్రముఖుల హితవు » మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా అవగాహన సదస్సులు, ర్యాలీలు

నర్సీపట్నం, జూన్ 26 : యువత గంజాయి తీసుకోవడం వల్ల భవిష్యత్తు బుగ్గిపాలవుతుందని సివిల్ జడ్జి పటాన్ షియాజ్‌ఖాన్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు వ్యతిరేక దినం సందర్భంగా బుధవారం బుధవారం కోర్టు సముదాయంలో సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ప్రతి క్షణం వారిని గమనిస్తుండాలన్నారు. వారితో ప్రేమగా మాట్లాడుతూ మంచి నడవడిక అలవడేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి మధుసూదనరావు, న్యాయవాదులు గంగరాజు, అప్పలనాయుడు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిసలై యువత బంగారు భవిష్యత్తుని పాడు చేసుకోవద్దని పట్టణ సీఐ కాంతికుమార్ పిలుపునిచ్చారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రైవేటు కళాశాలల విద్యార్థులతో పట్టణంలో అబీద్ సెంటర్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారం నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల నడవడిక మీద తల్లిదండ్రుడు దృష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సైలు సుధాకర రావు, ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చోడవరంలో..

చోడవరం : భవిష్యత్‌ను నాశనం చేసే గంజాయి, ఇతర మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని స్థానిక సీఐ బి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలో విద్యార్థులు పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వద్ద విద్యార్థులు మానవహారం నిర్వహించి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసులతో పాటు, స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాధాకృష్ణ, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కె.కోటపాడులో..

కె.కోటపాడు : విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అయ్యన్న విద్యా సంస్థలలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాశీం మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాల మహమ్మారికి బలికాకుండా బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. వ్యాసరచన పోటీల్లో అయ్యన్న జూనియర్ కాలేజి విద్యార్థినీలు జి.సాయి, అశ్విత, ఐ.గీతిక.., డిగ్రీ కాలేజి విద్యార్థినీలు ఎస్.శిరీష, ఎస్.మౌనికలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సెట్విస్ మేనేజర్ ఎస్.వెంకటేష్, సూపరింటెండెంట్ ఎంఎస్వీ సన్యాసిరావు, ఎన్ఎస్ఎస్ పీవోలు గాడి అప్పారావు, సీమునిరి రమణ తదితరులు పాల్గొన్నారు.

రావికమతంలో..

రావికమతం : అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా కలక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలో రావికమతం, కొత్తకోట పోలీసుల ఆధ్వర్యంలో కొత్తకోట జూనియర్ కళాశాల విద్యార్థులు, రావికమతం హైస్కూల్ విద్యార్థులతో గ్రామ పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పాడి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రావికమతం, కొత్తకోట ఎస్ఐలు ధనుంజయనాయుడు, లక్ష్మణరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేటలో..

కృష్ణాదేవి పేట : మత్తు పదార్థాలకు బానిస కావడం వల్ల జీవితం నాశనం అవుతుందని కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర, గొలుగొండ ఎస్ఈబీ ఎస్ఐ ఎస్కె రహీమ్ అన్నారు. బుధవారం కృష్ణాదేవిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ అనే కార్యక్రమంలో భాగంగా స్థానిక పోలీసులు, ఎస్ఈబీ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి విద్యార్థులు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు, పోలీసు సిబ్బంది, అధికారులు ప్రధాన రహదారిలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ గురుమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీహరి, హెచ్ఎం నాగభూషణం, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగులలో..

మాడుగుల : మాదకద్రవ్యాల నివారణకు సంబంధించి ప్రతీ ఒక్కరి కృషి అవసరమని కె.కోటపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌సీహెచ్ స్వామినాయుడు పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిరోధక దినోత్సవం సందర్భంగా మాడుగుల కేంద్రంలో ఎస్సై దామోదరనాయుడు, ఎస్ఈబీ ఎస్సై కె.హన్‌మంత్ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ, బస్టాండ్ ఆవరణంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలు నివారణకు సంబంధించి పలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్, ఎస్ఈబీ పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణాదేవిపేట : అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ఉపేంద్రం, గొలుగొండ ఎస్ఈబీ ఎస్ఐ రహీమ్



మాడుగుల : ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు



ఎమ్మెల్యే సత్కరిస్తున్న టీడీపీ నేతలు

ఎమ్మెల్యే రాజుకు సత్కారం

రోలుగుంట, జూన్ 26 : రోలుగుంట మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రం రోలుగుంటలో స్థానిక పాలకేంద్రం వద్ద మండల పార్టీ అధ్యక్షుడు గుములూరు చంద్రమౌళి, ఎంపీటీసీ సుర్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. మండలంలోని 24 పంచాయతీల నుంచి అధిక సంఖ్యలో టీడీపీ శ్రేణులు పాల్గొని కూటమి ప్రభుత్వంలో ఆఖండ మెజార్టీతో గెలిపొందిన కె.ఎస్.ఎన్.రాజును పూల మాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ జరిగిన ఎన్నికల్లో రోలుగుంట మండలం నుంచి 6500కు పైగా మెజార్టీని అందించి ఆఖండ విజయానికి కృషి చేశారన్నారు. ప్రతీ కార్యకర్త కష్టించి టీడీపీ విజయానికి కృషి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బంటు చిరంజీవి, కోలిపల్లి ఈశ్వరరావు, సుర్ల బాబులునాయుడు, బోడాపాత్రుని నరేష్, శానాపతి ఆదినారాయణ, పరిసం లోవరాజు, పిట్ల బుల్లిబాబు, వుండా రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు పూర్వ వైభవం

... 3వ పేజీ తరువాయి

ఊసేలేదు.పంచాయతీలు కరెంటు బిల్లులు చెల్లించాలంటే ఇంటి పన్నులు వసూలు అయితేనే కానీ బిల్లులు చెల్లించలేని దుస్థితికి వెళ్లాయి. బ్లీచింగ్, సున్నం వంటి వస్తువుల కొనుగోలుకు నిధులు లేక పంచాయతీలు ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లాలో 646 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా పంచాయతీలను 522 గ్రామ సచివాలయాల పరిధిలోకి తెచ్చిన వైసీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయాలుగా పేరు మార్చి ఒక భవనంలో రెండు మూడు పంచాయతీ కార్యాలయాలను విలీనం చేసింది. ఆ కార్యాలయంలోనే సర్పంచులకు చాంబర్లు ఏర్పాటు చేసింది. ఆర్థిక సంఘం నిధులు సర్పంచులకు తెలియకుండానే ప్రభుత్వం దారి మళ్లించడంతో సర్పంచుల చేతిలో చిల్లిగవ్వ లేకుండా కాలం వెల్లదీయాల్సి వచ్చింది. గ్రామ పంచాయతీలకు సకాలంలో నిధులు రాకపోవడంతో కొందరు సర్పంచులు పూర్తిగా పాలనపై దృష్టి కేంద్రీకరించలేకపోయారు. మరికొందరు సర్పంచులు అప్పులు చేసి చేపట్టిన పనులకు బిల్లులు అందక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టడంతో గ్రామ పంచాయతీలకు పూర్వ వైభవం వస్తుందని స్థానిక సంస్థల ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కాలువ ఆక్రమణపై ఫిర్యాదు



ఇరిగేషన్ ఏఈకి ఫిర్యాదు చేస్తున్న రైతులు

రావికమతం, జూన్ 26 : రెండు గ్రామాల ఆయకట్టు భూములకు నిరాటకంగా సాగు నీరందించే కొత్తకోట ముంత మామిడి చెట్టు ఆక్రమణను తక్షణమే తొలగించి ఖరీఫ్ సాగుకు ఆటంకం లేకుండా చేయాలని ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణదొరకు బుధవారం ఆయకట్టు రైతులు ఫిర్యాదు చేశారు. కల్యాణపులోవ టీకేజీ వాటరుతో పాటు కొండగెడ్డల వర్షపు నీరు ముంత మామిడి ఊరకాలువ పూర్వీకుల కాలం నుంచి కొత్తకోట గ్రామం మధ్యలో నుంచి ఉంది. ఈ కాలువ ద్వారా కొత్తకోట, కన్నంపేట గ్రామాలకు చెందిన 250 ఎకరాలకు ఏటా సాగునీరు ఢోకా లేకుండా అందిస్తుంది. అయితే ఈ కాలువ గ్రామం మధ్య నుంచి ఉండటంతో తరచూ వ్యర్థాలతో పూడిక పోయి పంట పొలాలకు సాగు నీరు సక్రమంగా అందడం లేదని రైతులు వాపోతున్నారు. ఆయకట్టు రైతుల అభ్యర్థన మేరకు అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న కెఎస్ఎన్ రాజు చొరవతో 2015-16లో సుమారు రూ.40 లక్షలతో ఈ కాలువను గ్రామ పరిధిలో కొంత మేర సీసీ డ్రైన్ కూడా నిర్మించారు. అయితే ఇటీవల ఈ కాలువను కొత్తకోట గ్రామానికి చెందిన ద్వారపు రెడ్డి సత్యనారాయణ ఆక్రమించి కాలువలో కాంక్రీట్ వేసి గోడ కట్టే ప్రయత్నం చేస్తుండగా, రెండు గ్రామాల ఆయకట్టు రైతులు అడ్డగించారు. ఆపై ఇరిగేషన్ సత్యనారాయణదొరను రప్పించి కాలువ ఆక్రమణను నేరుగా చూపించి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. పంట కాలువలో ఆక్రమణను సర్వే చేసి తక్షణమే తొలగించాలని రైతులు బంటు శ్రీను, కోట సత్యనారాయణ, ఉగ్గిన శ్రీను, కె.నరసింగరాజు, గుమ్మడు వాసు, జి.శ్రీను తదితరులు కోరారు.

ప్రశాంతంగా లక్ష్మీపురం పాల సంఘం డైరెక్టర్ల ఎన్నిక

» ఇద్దరు టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవం
» భారీగా పోలీసు బందోబస్తు
» పకడ్బందీగా నిర్వహించిన అధికారులు

చోడవరం, జూన్ 26 : మండలంలోని లక్ష్మీపురంలో విశాఖ డెయిరీ పాలసంఘం డైరెక్టర్ల ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులు ఇద్దరు డైరెక్టర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏటా లక్ష్మీపురం పాల సంఘంలో ఖాళీ అయ్యే ఇద్దరు డైరెక్టర్ల పదవులకు సభ్య రైతులలో నుంచే పాడిరైతులు చేతుల ఎత్తడం ద్వారా కొత్త డైరెక్టర్లను ఎన్నుకుంటారు. ఈ ఏడాది కూడా పాలసంఘంలో డెయిరీ డైరెక్టర్లను బుధవారం ఎన్నుకున్నారు. అయితే పాలసంఘం సందర్భంగా టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య ఉద్రిక్తత తలెత్తే పరిస్థితులు ఉండడంతో పాటు గ్రామంలో గొడవలు జరిగే అవకాశం ఉందని సమాచారం అందడంతో సీఐ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాలసంఘం వద్ద ముందుజాగ్రత్తగా భారీగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం పాలసంఘం సభ్యులను సమావేశ పరచిన డెయిరీ ఉద్యోగులు, ఎలాంటి గొడవలకు ఆస్కారం లేకుండా ఎన్నిక ప్రశాంతంగా ముగించారు. చేతులు ఎత్తడం ద్వారా పాడిరైతులు ఇద్దరు డైరెక్టర్లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులైన ఇల్లపు చిన సత్యనారాయణ, తుంపాల గంగ రాజులను డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో విశాఖ డెయిరీ అధికారులతో పాటు, స్థానిక పాల సంఘం మాజీ అధ్యక్షులు సిరిసోళ్ల సత్యారావు ఇతర పెద్దలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పాలసంఘం సభ్యులు

పుస్తకాలు విక్రయిస్తున్న ప్రైవేటు పాఠశాలలో ఎంఈవో తనిఖీ

నర్సీపట్నం, జూన్ 26 : ప్రైవేటు పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా పుస్తకాలు విక్రయిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలో అధిక ఫీజులు, పాఠశాలల ఆవరణలో అధిక ధరలకు పుస్తకాలు విక్రయాలపై ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాలు తరుచు ఆందోళనలు చేస్తున్నారు. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ చేసి గ్రీవెన్స్‌లో ఆర్డీవో జయరామ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈవో తలుపులుని పిలిచి ఆర్డీవో వివరణ తీసుకున్నారు. ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఎంఈవోను ప్రశ్నించారు. మంగళవారం ఒక ప్రైవేటు స్కూల్ వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేసి డీఈవోకి ఫిర్యాదు చేశారు.

డీఈవో ఆదేశాలతో ఎంఈవో-2 నాగేంద్ర ప్రైవేటు పాఠశాలలో పుస్తకాలు విక్రయించడం చూసి యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పుస్తకాలు నిల్వ ఉంచి గదిని సీజ్ చేసి డీఈవోకి నివేదిక ఇచ్చారు.

ఉల్లంఘనులపై విచారణ

... 3వ పేజీ తరువాయి

బుధవారం గనుల శాఖ అధికారులు సర్వే ప్రారంభించారు. తీసుకున్న తాత్కాలిక పర్మిట్లకు లోబడే తవ్వకాలు జరిపారా? లేక అదనంగా తవ్వారా? అనేది తేల్చడానికి సర్వే చేస్తున్నామని, ఇందుకు రెండు రోజులు సమయం పడుతుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. అలాగే పెందుర్తి మండలం గుర్రంపాలెం ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో పలువురికి స్థలాలు కేటాయించారు. ప్లాట్ల చదును సమయంలో లేఅవుట్‌కు ఆనుకుని ఉన్న కొండ, సమీపంలో భూముల నుంచి మట్టిని తరలించారు. కొండ నుంచి మట్టి తరలింపునకు ఎటువంటి పర్మిట్లు తీసుకోలేదు. ఏపీఐఐసీ అధికారులు, సిబ్బంది ప్రోత్సాహంతోనే అక్కడ తవ్వకాలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదిలావుండగా పరవాడ మండలంలో రెండుచోట్ల గనుల శాఖ ఇచ్చిన క్వారీల్లో అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదుపై విచారణ చేపట్టనున్నారు. మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు తన కుమారుడి పేరిట గ్రావెల్ క్వారీ తీసుకున్నారు. ఇంకా తాడిలో మరో గ్రావెల్ క్వారీ ఉంది. ఈ రెండు క్వారీల్లో జారీచేసిన పర్మిట్లకు మించి తవ్వకాలు చేపట్టారని ఫిర్యాదు అందినందున త్వరలో విచారణ చేస్తామని గనుల శాఖ అధికారులు పేర్కొన్నారు. ఇంకాఉమ్మడి జిల్లాలో మరికొన్ని క్వారీలపై కూడా ఫిర్యాదులు అందాయని, అయితే వాటి వివరాలు ప్రభుత్వంనుంచి రావాల్సిఉందని చెబుతున్నారు.

'నీట్' రద్దు చేయాలి : విద్యార్థి సంఘాల డిమాండ్



ధర్నా చేపట్టిన విద్యార్థి సంఘాలు

చోడవరం, జూన్ 26 : అక్రమాలు చోటు చేసుకున్న నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల విద్యార్థి సమాఖ్య (పీడీఎస్‌వో), నవయువ సమాఖ్యల ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.భాస్కర్ మాట్లాడుతూ నీట్ పరీక్షను రద్దు చేయడంతో పాటు ఈ పరీక్షల్లో అక్రమాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షల్లో అక్రమాలు చోటుచేసుకున్నా ప్రధానమంత్రి కనీసం స్పందించకపోవడం ఈ దేశ విద్యార్థులు చేసుకున్న దౌర్భాగ్యమని వాపోయారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌వో జిల్లా నాయకులు మౌనిక, బి.రాజేష్, నవయువ సమాఖ్య నేతలు కె.రామకృష్ణ, టి.అర్జున్, ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నర్సీపట్నం, జూన్ 26 : నర్సీపట్నం ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో ప్రాంతీయ ఆస్పత్రి ఫీడర్‌లో లైన్ మరమ్మతులు కారణంగా గచ్చపువీధి, బొంతువీధి, కొత్త వీధి, తురకబడి, వెలమవీధి ప్రాంతాల్లో గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు విద్యుత్ సరపరా నిలిపి వేస్తున్నట్టు డివిజన్ ఇంజనీర్ వీడీవీ రామకృష్ణ తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

గొలుగొండలో..

గొలుగొండ : మండలంలోని చీడిగుమ్మల ఫీడర్ విద్యుత్ లైన్‌లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీడీవీ రామకృష్ణ తెలిపారు. మండలంలోని గొలుగొండ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి చీడిగుమ్మల గ్రామాల మధ్యలో గల విద్యుత్ లైన్ కింద జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చోడవరం, జూన్ 26 : పట్టణ పరిధిలోని 33 కేవీ సబ్‌స్టేషన్ నిర్వహణ పనులు చేపడుతున్నందునఈ నెల 28న (శుక్రవారం) ఉదయం నుంచి సాయంత్రం వరకూ పట్టణంతో పాటూ రూరల్ పరిధిలోని గ్రామాల్లో సైతం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు స్థానిక ఈపీడీసీఎల్ ఏఈఈ శ్రీనివాసరాజు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ టౌన్‌ఫీడర్‌లోని పట్టణంలోని అన్ని ప్రాంతాలతో పాటు అన్నవరం ఫీడర్ పరిధిలోని అన్నవరం, గాంధీ గ్రామం, వెంకయ్యగారిపేట, ఎడ్లవీధి, నరసయ్యపేట, గోవిందమ్మకాలనీ, సిటిజన్ కాలనీ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈఈ విజ్ఞప్తి చేశారు.

వాలాబు గెడ్డ ఉధృతి.. ఆవలి ఒడ్డున చిక్కుకున్న వైద్య సిబ్బంది

గిరిజనుల సహకారంతో ఒడ్డుకు...



వాలాబు గిరిజనుల సహాయంతో ఒడ్డుకు చేరుతున్న సిబ్బంది

దేవరాపల్లి, జూన్ 26 : మారుమూల గిరిజన గ్రామాలకు వైద్య సేవలు అందించడానికి వెళ్లిన వైద్య సిబ్బంది గెడ్డలు ఉధృతంగా ప్రవహించడంతో అలతలి గట్టున చిక్కుకుపోయారు. గిరిజనుల సహకారంలో ఎట్టకేలకు ఇవతల తీరానికి చేరుకొని ఊపిరిపీల్చుకున్నారు. అనంతగిరి మండలం పినకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జీనబాడు ఉపకేంద్రం ఏఎన్ఎం కె.పుష్ప, హెల్త్ అసిస్టెంట్ రామరాజు, మానస మిత్ర డి.జమ్ములమ్మ బుధవారం బెంబి గ్రామానికి వైద్య సేవలు అందించడానికి దేవరాపల్లి మండలం వాలాబు పంచాయతీ కెటిపాలెం వరకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. అక్కడ నుంచి రహదారి సౌకర్యం లేకపోవడంతో ఐదు కిలోమీటర్లు కాలి నడకన బెంబి గ్రామానికి చేరుకొని వైద్య శిబిరం నిర్వహించారు. తిరిగి వస్తుండగా సరియా వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. చేసేది లేక అక్కడే గంటల తరబడి వేచి చూశారు. ఎప్పటికీ వాగు ఉధృతి తగ్గకపోవడంతో సమీపంలో చేపలు పడుతున్న కె.టిపాలెం గిరిజనులు వీరి పరిస్థితి గమనించారు. అతికష్టం మీద వైద్య సిబ్బందిని వాగును దాటి వేయించారు. దీంతో వైద్య సిబ్బంది సురక్షితంగా ఒడ్డుకు చేరారు. గిరిజనులకు వైద్య సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.